RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 313 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 డిసెంబర్ 2024 బుధవారం పేజీలు : 4

### గ్యాంగ్‌స్టర్‌ను పట్టుకుంటే రూ.10లక్షలు

న్యూఢిల్లీ: జైలు శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. ఈ మేరకు అతనిపై రూ. 10లక్షల రివార్డు ప్రకటించింది. అన్మోల్ బిష్ణోయ్ కూడా పేరు మోసిన గ్యాంగ్ స్టర్. ఇప్పటికే ఇతను ఓ కేసులో దోషిగా తేలగా బెయిల్‌పై విడుదలై తప్పించుకుని తిరుగుతున్నాడు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటిపై కాల్పుల కేసులోనూ అతనిపై అభియోగాలు ఉన్నాయి. అలాగే ఇటీవల సంచలనం రేపిన ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ, కాంగ్రెస్ నేత, సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య కేసులతోపాటు మొత్తం 17కేసుల్లో అన్మోల్ నిందితుడిగా ఉన్నాడు.

# న్యూయార్క్, టోక్యో తరహాలో హైదరాబాద్ అభివృద్ధి



## రైజింగ్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి!

హైదరాబాద్: హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. న్యూయార్క్, టోక్యో తరహాలో ప్రపంచంతో పోటీ పడేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామన్నారు. నగరంలో మౌలిక వసతుల కల్పనకు రూ. 7వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. ఎస్‌టీపీలు, ఫ్లైఓవర్లు, నాలాల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రైజింగ్ వేడుకల్లో సీఎం మాట్లాడారు. "ప్రజా పాలన కోసం ఏడాది క్రితం ప్రజలు తీర్పు ఇచ్చారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని పెంచాం. మెట్రోను హైదరాబాద్‌కు తీసుకొచ్చింది కాంగ్రెస్సే. రాష్ట్ర ఆదాయంలో 60 శాతం హైదరాబాద్, రంగారెడ్డి నుంచే వస్తుంది. రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణకే మణిహారం. రూ. 35 వేల కోట్లతో 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డుకు ప్రయత్నిస్తున్నాం. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌ను నిర్మించబోతున్నాం. ఓఆర్ఆర్‌కు అనుబంధంగా ముచ్చర్ల ప్రాంతంలో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాం. 40 నుంచి 50 వేల ఎకరాల్లో అద్భుతంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తాం. టోక్యో, న్యూయార్క్‌తో పోటీ పడేలా నిర్మిస్తాం. రూ. లక్షన్నర కోట్లు ఖర్చు పెడితే హైదరాబాద్ అద్భుత నగరం అవుతుంది" అని సీఎం తెలిపారు.

**మూసీ ప్రాజెక్టు కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడం: భట్టి విక్రమార్క...** తెలంగాణకు హైదరాబాద్ తలమానికం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నగరంలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. "హైదరాబాద్ అభివృద్ధికి గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. గతంలో కాంగ్రెస్ చేసిన ప్రగతిని.. భారాస చేసినట్లు చూపించింది. ప్రజల జీవనానికి అనుగుణంగా గతంలో కాంగ్రెస్ అనేక సౌకర్యాలు కల్పించింది. అభివృద్ధి చెందిన దేశాలు నదులను పరిశుభ్రంగా ఉంచుతున్నాయి. నదుల చుట్టూ పర్యాటకం అభివృద్ధి చేసి ఆర్థికంగా పురోగతి సాధిస్తున్నాయి. హైదరాబాద్ అభివృద్ధి కోసం మూసీ పునరుజ్జీవనం చేయాలనుకున్నాం. మూసీ పునరుజ్జీవనం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని సోషల్ మీడియా ద్వారా కుట్రలు చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రజలు అభివృద్ధి చెందకూడదని భారాస, భాజపా కుట్ర చేస్తున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడం. హైదరాబాద్‌లో 400 మురికి వాడలున్నాయి" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనం

## - హరీష్‌రావు మెడకు ఆ కేసు ఉచ్చు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది ఈ కేసులో విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే పలువురిని దర్యాప్తు అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఇవాళ(మంగళవారం) కేసు నమోదైంది. సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని పంజాగుట్ట పోలీసులకు చక్రధర్ ఫిర్యాదు చేశారు. దీంతో హరీష్ రావుతో పాటు టాస్క్ ఫోర్స్‌లో పనిచేసిన రాధాకిషన్ రావుపై కేసు నమోదు చేశారు. సెక్షన్ 120 (బీ), 386,409,506 , రెడ్ విత్ 34, ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదైంది.

**పోలీసుల విచారణ ...** గతంలో హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసులో డీజీపీకి, జూబ్లీహిల్స్ ఏసీపీకి చక్రధర్ గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అలర్ట్ మెసేజ్ వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదుపై గతంలో రెండుసార్లు పోలీసులు విచారణ చేశారు. హరీష్ రావు తన ఫోన్ ట్యాప్ చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోసారి విచారణకు రావాలని పోలీసులు ఆదేశించడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ ముందు చక్రధర్ గౌడ్ విచారణకు హాజరయ్యారు. ఆయన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులు పరిశీలించి విచారణ చేశారు.

**ఆపిల్ కంపెనీ ద్వారా అలర్ట్ మెసేజ్..** ఈ సందర్భంగా చక్రధర్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని, తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు ఆపిల్ కంపెనీ ద్వారా తనకు అలర్ట్ మెసేజ్ వచ్చిందని, దీనిపై గతంలో డీజీపీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. గంటన్నర పాటు పోలీసులు విచారణ జరిపి.. స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారని తెలిపారు.

అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు బీఆర్ఎస్ పార్టీలో చేరి హరీష్ రావుకు సరెండర్ అవ్వాలని... లేకపోతే అక్రమ కేసులు పెడతామని బెదిరింపులకు దిగారని చెప్పారు. తన వ్యక్తిగత ఫోన్‌తో పాటు తన భార్య, డ్రైవర్, తమ కుటుంబ సభ్యుల ఫోన్లు అన్ని ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం ఇచ్చానని, తాము చెప్పినట్లు వినకపోతే తన కుటుంబాన్ని అంతం చేస్తామంటూ అప్పటి ట్రాన్స్‌పోర్టు డీసీపీ రాధా కిషన్ రావు బెదిరింపులకు దిగారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌పై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసి పోరాటం చేస్తున్నానని, న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ వేసి పోరాటం చేస్తానని చక్రధర్ గౌడ్ స్పష్టం చేశారు.

**వారిపై హైకోర్టులో విచారణ ..** అయితే ఫోన్ ట్యాపింగ్ కేసులో రాధా కిషన్ రావు, భుజంగరావు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేసింది. ఇప్పటికే రెండు సార్లు బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. భుజంగరావు, రాధా కిషన్ రావులు ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కూడా గతంలో పోలీసుల విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ నేతృత్వంలోని బృందం ఆయనను విచారించింది. విచారణలో మాజీ అదనపు ఎస్పీ తిరుపతన్న కాల్ లిస్ట్ చుట్టూ తిరిగింది.

"మీరు తిరుపతన్న మొబైల్ ఫోన్‌కు రెండు ఫోన్ నంబర్లు పంపించారు. వాటిని ఎందుకు పంపారు" అని పోలీసులు ప్రశ్నించారు. రెండు గంటల పాటు విచారణ కొనసాగింది. కాగా.. ఈ కేసులో ఇటీవలే మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.. లింగయ్య ఇచ్చిన రెండు నంబర్లను తిరుపతన్న ట్యాప్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు.



## విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న కాలేజీలపై కఠిన చర్యలు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: ఇంటర్ కాలేజీల్లో విద్యార్థుల మరణాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. పది రోజుల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ర్యాంకుల పేరిట ఒత్తిడికి గురి చేసే విధానాలు మానుకోవాలన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. "అత్యవసర సమస్య ఉంటే విద్యార్థులు నన్ను సంప్రదించవచ్చు. నా ఆఫీసు మొబైల్ నెంబర్ 86880-07954. minister.randbc@gmail.com ఈమెయిల్‌కు సమస్యలను తెలియజేయండి" అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# హైడ్రా కూల్చివేతలు మళ్లీ స్టార్ట్..

## టెన్షన్ టెన్షన్!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో చెరువులపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న సంచలన నిర్ణయమే హైడ్రా. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న చాలా అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. రాష్ట్ర చరిత్రలోనే హైడ్రా ఏర్పాటు చేసిన 100 రోజుల వ్యవధిలోనే 300 అక్రమ నిర్మాణాలకు పైగా నేలమట్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19వ తేదీన హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 99ను తీసుకువచ్చింది. దీంతో జూలై 26 నుంచి కూల్చివేతలను మొదలుపెట్టింది హైడ్రా. ఇప్పటి వరకు 30 ప్రాంతాల్లో 300 ఆక్రమణలను కూల్చివేసింది. 100 రోజుల్లో 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగింది. జీహెచ్ఎంసీతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు మామూలుగా లేదు. హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో దేశవ్యాప్తంగా హైడ్రా పేరు మారుమోగిపోయింది.

**అల్మాస్‌గూడలో హైడ్రా కూల్చివేతలు...** బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలో ఇవాళ(మంగళవారం) హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అల్మాస్‌గూడాలో కబ్జాకు గురైన పార్కును హైడ్రా అధికారులు కాపాడారు. పిల్లల ఆట పరికరాలను తొలగించి ఆ స్థలం తనదంటూ ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేయడంతో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్థానికంగా లేఅవుట్లను పరిశీలించి.. పార్కు స్థలంగా హైడ్రా అధికారులు గుర్తించారు. కంటైనర్ తొలగించి పార్కు స్థలాన్ని కాలనీవాసులకు హైడ్రా అధికారులు అప్పగించారు.

**తీవ్ర వ్యతిరేకత రావడంతో..** అయితే.. హైడ్రా కూల్చివేతలపై ప్రజలు హడెలెత్తిపోయారు. ఎప్పుడు ఎవరి ఇంటిని కూల్చివేస్తారో అని భయాందోళనలో గడిపారు ప్రజలు. హైడ్రా కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత కూడా వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్‌లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు.

**ఏకధాటిగా కూల్చివేతలు..** నగరంలోని కూకట్‌పల్లి, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. మూడు ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించింది హైడ్రా. ఈ సమయంలో హైడ్రాపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ. లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు. అలాగే అమీన్ పూర్‌లో హైడ్రా బిగ్ ఆపరేషన్‌ను నిర్వహించింది. పగలు రాత్రి కూల్చివేతలు చేపట్టింది. దాదాపు 17 గంటలపాటు హైడ్రా నాన్ స్టాప్ కూల్చివేతలు చేపట్టింది. ఓ హాస్పిటల్, రెండు అపార్ట్ మెంట్లు కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. పటేల్ గుడాలో 16 విల్లాలను కూల్చివేసింది.




**పూర్తిస్థాయిలో బాధ్యతలు...** ఇటీవల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రేటర్ పరిధిలోని అక్రమ కట్టడాలన్నీ కూల్చివేసే పవర్ హైడ్రాకు ఇచ్చింది. ఈ మేరకు జీవో నెంబర్ 199ను ప్రభుత్వం విడుదల చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో పలుమార్పులు చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో మున్సిపల్ శాఖలో 374%దీ% ప్రత్యేక సెక్షన్ చేర్చింది. దీంతో బల్దియాతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల పరిధిలో హైడ్రా దూకుడు పెంచనుంది. ఇక నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తారు. అక్రమ కట్టడాలకు నోటిసులు జారీ నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రా చేయనుంది.

**హైడ్రాకు జీహెచ్ఎంసీ అధికారుల బదిలీ..** తాజాగా ప్రభుత్వ అనుమతితో కట్టిన నిర్మాణాలను కూల్చమని హైడ్రా స్పష్టం చేసింది. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని పలు అధికారాలను హైడ్రాకు బదలాయిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు (జీవో-191) జారీ చేసింది. జీవో 191తో హైడ్రా కు ప్రభుత్వం ఫుల్ పవర్స్ ఇచ్చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలోని 374 బీ అధికారులను హైడ్రాకు బదలాయిస్తూ తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ-1955 చట్టంలోని సెక్షన్ 374-బీ ప్రకారం చెరువులు, పార్కులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్లు, డ్రైన్‌ల పరిరక్షించాల్సి ఉంటుంది. ఈ అధికారాలను హైడ్రాకు బదిలీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. మంత్రివర్గ ఆమోదంతో ఆర్డినెన్సు ప్రతిపాదనలను గవర్నర్‌కు పంపింది. దీనిని ఆమోదిస్తూ ఈ నెల 3వ తేదీన గవర్నర్.. గెజిట్ విడుదల చేశారు. ఈ మేరకు తాజాగా పురపాలక శాఖ జీవో 191ను జారీ చేసింది. ఆర్డినెన్స్, జీవో జారీతో హైడ్రా చర్యలకు సంబంధించి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో పాటు సిటీలో వరద ముంపు సమస్య పరిష్కారం, ట్రాఫిక్ నియంత్రణ, చెట్ల సంరక్షణపైనా హైడ్రా ఫోకస్ చేయనుంది.

# సంపాదకీయం

## 13 రోజులు-13 నెలలు-13 మంది సభ్యులు
## బీజేపీలో హాట్ టాపిక్

బీజేపీలో ఇప్పుడు హాట్ టాపిక్ ఏంటంటే.. '13'. దీని చుట్టూనే కమల నాథుల రాజకీయం తిరుగుతోంది. ఎందుకో కానీ.. ఈ 13 అనేది బీజేపీకి అస్సలు కలిసి రావడం లేదని అంటున్నారు ఆ పార్టీ నాయకులు. ఇంతకీ.. ఇంత పెద్ద ఎత్తున అటు జాతీయ స్థాయి నుంచి ఇటు రాష్ట్రాల స్థాయి వరకు ఎందుకు 13 హాట్ టాపిక్ అయిందని చూస్తే.. దీని వెనుక చాలా కథే ఉంది. ప్రస్తుతం మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘన విజయం దక్కించుకుంది. ఇది జరిగి పది రోజులు అయింది. నవంబరు 23న వచ్చిన ఎన్నికల ఫలితం.. మహాయుతికి ప్రజలు పట్టం కట్టారని తేల్చి చెప్పింది. దీంతో మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ముఖ్యమంత్రి సీటు సహా.. హోం శాఖ పగ్గాల విషయంలో కూటమి పార్టీల నాయకుల మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. సీఎం సీటును వదులుకునేది లేదని కూటమి పార్టీ శివసేన స్పష్టం చేసింది. ఏదో ఒక విధంగా ఆ పార్టీని బ్రతిమాలారు. కానీ, హోం శాఖ విషయంలో మరోసారి రగడ చోటు చేసుకుంది. దీనిని ఇచ్చేది లేదని బీజేపీ చెప్పింది. కానీ, ఇది కూడా ఇవ్వకపోతే.. మేం ఎందుకని శివసేన పట్టుబట్టింది. మొత్తానికి అయిష్టంగానే బీజేపీ నేతలు హోం శాఖను శివసేనకు ఇచ్చేందుకు మొగ్గు చూపారు. దీంతో ప్రస్తుతానికి రగడ చల్లారింది. ఈ మధ్యలోనే చిత్రమైన చర్చ బీజేపీలో తెరమీదికి వచ్చింది. అదే 13! ఆశ్చర్యంగా అనిపించినా నిజం. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమిగా వెళ్లినప్పటికీ.. ఆ పార్టీకి ఒంటరిగానే 132 సీట్లు దక్కాయి. కానీ, ఒంటరిగా అధికారం చేపట్టాలంటే.. మొత్తం స్థానాల్లో మేజిక్ ఫిగర్ దక్కించుకోవాలి. అది.. 288 సీట్లలో 145. అంటే.. బీజేపీకి వచ్చిన 132 సీట్లకు 13 కలపాలి. ఈ పదమూడు లేకపోవడంతోనే ఇప్పుడు మహాయుతి కొనసాగుతోంది. అలా కాకుండా..ఏపీలో మాదిరిగా.. టీడీపీ ఒంటరిగా తెచ్చుకున్నట్టుగా(134) బీజేపీకనుక 145 సీట్లు తెచ్చుకుని ఉంటే.. ఇప్పుడు కూటమి ఉండేది కాదని బీజేపీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, ఆ 13 సీట్లు బీజేపీకి రాలేదు. ఈ నేపథ్యంలోనే తమకు 13కు మధ్య చాలా చరిత్ర ఉందని అంటున్నారు బీజేపీ నాయకులు. గతంలో వాజపేయి ప్రభుత్వం 13 రోజుల పాలన తర్వాత.. కుప్పకూలిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అదేవిధంగా అనంతరం ప్రబుత్వాన్ని ఏర్పాటు చేసినా.. ఆయన 13 నెలల తర్వాత.. మిత్ర పక్షం మమతా బెనర్జీ కాడి పడేయడంతో సర్కారు కుప్పకూలిపోయింది. అంటే.. 13 రోజులు, 13 నెలలు వాజపేయి ప్రభుత్వం చాలానే ఇబ్బందులు పడింది. తర్వాత.. పూర్తి మెజారిటీతో విజయం దక్కించుకుంది. ఇప్పుడు మహారాష్ట్రలోనూ కేవలం 13 మంది సభ్యుల కొరత కారణంగానే.. బీజేపీ మహాయుతి మిత్ర పక్షాలను బ్రతిమాలుకునే పరిస్థితి వచ్చిందని కమల నాథులు ఆపశోపాలు పడుతుండడం గమనార్హం.

# ఫ్రాంకింగ్‌కు పాతర




మూసాపేట : సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయల్లో 'ఫ్రాంకింగ్' సేవలకు పాతర వేసినట్లు పరిశీలనలో వెల్లడైంది. రూ.లక్షల విలువైన యంత్రాలను అటకెక్కించారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు. అత్యవసర, స్టాంపు పేపర్లు లేని సమయాల్లో.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పెద్దఎత్తున భూ, ఆర్థిక లావాదేవీలు జరుగుతుంటాయి. ఏ ఒప్పందాలు చేసుకోవడానికైనా నాన్ జ్యుడీషియల్ రూ.10, 20, 50, 100 స్టాంపు పేపర్లు ఉండాలి. అవి లేని సందర్భాల్లో, అత్యవసర సమయాల్లో తెల్లకాగితాలపై రాసుకున్న ఒప్పందాలకు 'ఫ్రాంకింగ్' చేసుకుంటేనే చట్టబద్ధత కలుగుతుంది. అందుకు బ్యాంకు చలానా ఇస్తే, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది ఎర్రని రంగుతో 'రాజముద్ర' తరహా చిహ్నాన్ని పత్రాలపై ముద్రించి ఇస్తారు. అలా స్థిర, చరాస్తులకూ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. మార్ట్‌గేజ్ డీడ్, బ్యాంకు లాకర్స్‌కు అవసరమైన ధ్రువపత్రాలకు, ఇండెమ్నిటీ బాండ్, ఎల్ఐసీ బాండ్ అవసరాలకు సైతం ఫ్రాంకింగ్‌ను వినియోగిస్తున్నారు. రూ.2 వేలలోపైతే 'టీ యాప్ ఫోలియో' ద్వారా అంతకుమించిన మొత్తమైతే ఎస్‌బీఐ చలానా చెల్లించి రసీదుతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే నిమిషాల వ్యవధిలోనే ఫ్రాంకింగ్ చేయాలి. కానీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది దీనికి తూట్లు పొడుస్తున్నారు.

**అవగాహన ఉన్నవారు ఒత్తిడి తెస్తే..**

ఫాంకింగ్‌పై అవగాహన ఉన్నవారు నేరుగా కార్యాలయానికి వెళ్లి సిబ్బందిపై ఒత్తిడి తేస్తే అప్పటికప్పుడు యంత్రాలను తీసి సేవలు అందిస్తున్నారు. ఈ దృశ్యం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కన్పించింది. మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యంత్రం పాడైందని.. మరమ్మతులకు చెన్నై సంస్థకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. రాజేంద్రనగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటకెక్కించారు.

**జరుగుతున్న తంతు ఇది..**

గ్రేటర్‌లోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రాంకింగ్ యంత్రాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ యంత్రాల నిర్వహణ బాధ్యతను 'పిట్నీ బోవ్స్' సంస్థకు అప్పగించారు. ఇవి మరమ్మతులు కావడం అరుదు. కానీ, రకరకాల కారణాలతో సిబ్బంది అటకెక్కించారు. సిబ్బంది లేరని, పనిచేయడం లేదని, ఇంకు అయిపోయిందని సాకులు చెబుతున్నారు. మరికొన్ని కార్యాలయాల్లో బయటి వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారు. సదరు సేవల కోసం బ్యాంకులకు వెళ్లి చలానాలు చెల్లించినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న సదరు వ్యాపారులు వినియోగదారులను దండుకుంటున్నారు.

# చెత్త కష్టాలకు చెక్ పెట్టేలా ..
# నగరం నలువైపులా 4 కేంద్రాలు



సంగారెడ్డి : ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా.. మహానగరంలో చెత్త సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపబోతోంది. ప్రస్తుతం నగరంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను జవహర్‌నగర్‌కు మాత్రమే తరలించడంతో ఈ ప్రాంతంలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. దీన్ని అధిగమించేలా, నగరానికి నాలుగు వైపులా చెత్త తరలింపు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తికేంద్రాల ఏర్పాటుకూ ప్రణాళిక సిద్ధమైంది. అందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యచరణపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ బల్దియా అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో చర్చించారు.

సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో 150 ఎకరాల భూమిని సేకరించారు. ఇక్కడ చెత్త నిర్వహణతో పాటు 15 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేయబోతున్నారు. జవహర్‌నగర్‌లో మ్యానువల్‌గా చెత్త నిర్వహణ చేస్తుండగా ప్యారానగర్‌లో మాత్రం ఆధునిక పద్ధతులను అవలంభించబోతున్నారు. ఒక బంకర్ నిర్మించి నాలుగువైపులా పెద్ద షెడ్డు నిర్మించనున్నారు. బంకర్‌లోనే చెత్తను తడి, పొడి చెత్తగా విభజిస్తామని, దీంతో కాలుష్య సమస్య ఏర్పడదని అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో 1500 టన్నుల పొడి చెత్తను విద్యుదుత్పత్తికి వినియోగించనున్నారు.

చౌటుప్పల్ దగ్గర మల్కాపూర్‌లో మరో కేంద్రాన్ని 100 ఎకరాల్లో ఏర్పాటుచేయనున్నారు. ఇక్కడ కూడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో కూడా 40 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఇంత తక్కువ స్థలంలో నిర్వహణ కేంద్రం ఏర్పాటు కష్టసాధ్యమని చెబుతున్నారు.

నగరంతో పాటు చుట్టుపక్కల మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రతిరోజూ ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తిఅవుతోంది. ఇందులో సగం పొడిగా, మరో సగం తడి చెత్త. మొత్తం చెత్తను కొన్నేళ్లుగా జవహర్‌నగర్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ 24 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని కొన్నాళ్లకిందటే రాంకీ సంస్థ ఏర్పాటుచేసింది. ఇందులో 1400 టన్నుల పొడి చెత్తను వినియోగిస్తున్నారు. మరో 24 ఎంవీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణం మార్చికల్లా పూర్తవుతుందని ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దుండిగల్‌లో మరో విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక నగర వ్యాప్తంగా చెత్తను జవహర్‌నగర్‌కు తరలించడం కష్టంగా మారడంతో మరో నాలుగు చోట్ల చెత్త నిర్వహణ, విద్యుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. బల్దియా అధికారులు ఏడాదిగా సంబంధిత స్థలాల అన్వేషణ చేశారు. పటాన్‌చెరు మార్గం లక్డారం సమీపంలో వంద ఎకరాల్లో ఒక చెత్త నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. ఇక్కడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేయనున్నారు. దీనికి కూడా 1500 టన్నుల పొడి చెత్త అవసరమవుతుంది.

# అసంపూర్తి వంతెన నిర్మాణానికి అడుగులు

వేములవాడ: గత రెండేళ్లుగా వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిన వేములవాడలోని మూలవాగుపై వంతెన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. వంతెనకు ఇరువైపులా భూసేకరణకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో అడ్డంకులు తొలగిపోనున్నాయి. ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగుపై రెండు వంతెనల నిర్మాణంతోపాటు ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టడానికి అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ.28 కోట్ల కోర్‌నెట్ నిధులను మంజూరు చేసింది. ఇందులో వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లను కేటాయించారు. దీంతో పనులు చేపట్టిన గుత్తేదారు మూలవాగుపై పడమర వైపు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. రెండో వంతెన పనులు మొదలు పెట్టినప్పటికీ భారీ వర్షాలు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా వంతెన నిర్మాణంలో పనులు ఆగుతూ సాగుతూ చివరికి నిలిచిపోయాయి.

**నిర్మాణం ఇలా...**మూలవాగుపై వంతెనల నిర్మాణంతో ఆధ్యాత్మికత ఉట్టి పడేలా డిజైన్ చేశారు. 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో రెండు వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో పడమర వైపు వంతెన పూర్తయి వినియోగంలోకి రాగా, రెండోది మధ్యలో ఆగిపోయింది. దీంతో పాటు వంతెనకు ఇరువైపులా కూడళ్లను ఆధ్యాత్మికత ఉట్టి పడేలా సుందరీకరణ చేయాల్సి ఉంది. ఇందుకు భూసేకరణ పూర్తి కావాల్సి ఉంది. వంతెన నిర్మాణ ప్రాంతాల్లో భూములు, ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం అందించేందుకు రూ.6.96 కోట్లను ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసింది. వంతెన పనులకు మరో రూ.3 కోట్లను మంజూరు చేసింది. దీంతో రెండో వంతెన పనులకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది.

**2018లో పూర్తి చేయాల్సి ఉన్నా...**మూలవాగు వంతెనల నిర్మాణ పనులు 2015 ప్రారంభమైనప్పటికీ ఒప్పందం ప్రకారం 2018



సంవత్సరంలోనే పూర్తి చేయాల్సి ఉంది. మొదటి వంతెన సకాలంలో పూర్తయినప్పటికీ, ఏటా అవాంతరాలు ఏర్పడటంతో రెండోది కాలేదు. ఈ వంతెన మొదలు పెట్టినప్పటి నుంచి భారీ వర్షాలకు మూడేళ్లలో మూడు సార్లు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయాయి. దీంతో పనులు ఎప్పుడూ సాఫీగా జరిగిన దాఖలాలు లేవు. రెండో స్టాండ్ బీమ్‌ల నిర్మాణ సమయంలో భారీ వర్షాలకు కుంగిపోయింది. ఆ తరవాత రెండు సార్లు భారీ వర్షాలకు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయి బీమ్‌లు వంగిపోయాయి. ఏటా సెంట్రింగ్ పనులు చేయడం, భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో గుత్తేదారు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. దీంతో రెండేళ్లుగా పనులు పూర్తిగా ఆగిపోయాయి.

**త్వరలో పూర్తికి చర్యలు**మూలవాగులో నిలిచిపోయిన రెండో వంతెన నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వంతెనకు ఇరువైపులా భూసేకరణకు రూ.6.96 కోట్లను మంజూరు చేయడం జరిగింది. గత ప్రభుత్వం భూసేకరణకు నిధులు కేటాయించకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. గుత్తేదారును కూడా మార్చాం. టెండరు ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరఫున గౌడ సంఘం, అలాగే తిమ్మాయిపల్లి కి చెందిన సుమతి– మల్లేష్ దంపతులు వారి కుటుంబ సభ్యులు, ప్రమిల





బి రవల్, మనీష్ రవల్, సిద్దిపేటకు చెందిన చారి వారి కుటుంబ సభ్యులు, తూము గుంటకు చెందిన నరసింహ వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# చెంజర్ల గడ్డ.. ఉద్యోగుల అడ్డా

మానకొండూర్: గతంలో కరవు కాటకాలతో సతమతమైన గ్రామం అది. ప్రస్తుతం గురువులకు నిలయంగా మారింది. తలాపున కాకతీయ కాలువ ప్రవహిస్తున్నా ఆ పల్లెకు చుక్క నీరు అందడం లేదు. సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్తు బాగుపడుతుందని పెద్దలు తలచారు. ముందుగా ఆరుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తితో అదే ఉద్యోగాన్ని సాధించాలని మరికొంత మంది దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ప్రస్తుతం ఒక తరాన్ని ప్రభావితం చేయగలిగిన గురువులు ఈ ఊరి సొంతం. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 70 మంది ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉండడం విశేషం.

మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో ఆశించిన మేర వ్యవసాయం సాగలేదు. దీంతో పలు కుటుంబాలు జీవనోపాధి కోసం ముంబయి, బీవండి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలోనే తమ భవిష్యత్తుపై ఆందోళన చెందిన స్థానిక యువత.. చదువుపై దృష్టి సారించింది. మొక్కవోని దీక్షతో.. ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో..



ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు కొనసాగించారు. 2006 డీఎస్సీలో గ్రామం నుంచి ఒక్కసారే ఆరుగురు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. ఈ పరిణామం గ్రామంలోని పలువురిని ఉపాధ్యాయ వృత్తి వైపు మళ్లించేలా చేసింది. వారి ఆసక్తికి.. స్థానిక ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్‌ల ప్రోత్సాహం తోడైంది. వారు ఇచ్చిన సూచనలను సద్వినియోగం చేసుకున్న 18 మంది అభ్యర్థులు 2012 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై అరుదైన ఘనత సాధించారు. ఒకే గ్రామం నుంచి అంతమంది ఉద్యోగానికి ఎంపికైన దాఖలాలు రాష్ట్ర చరిత్రలోనే లేవు. అదే స్ఫూర్తితో ప్రతీసారి ఈ గ్రామం నుంచి ఉపాధ్యాయులుగా ఎంపిక అవుతూనే ఉన్నారు. తాజా డీఎస్సీలోనూ ఒక్క పీఈటీ, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఆరుగురు ఎస్జీటీలు ఎంపికవడం గమనార్హం. వీరితోపాటు గ్రామంలో 17 మంది కానిస్టేబుళ్లతోసహా ఇతర విభాగాల్లోనూ ఉద్యోగులు ఉండటం విశేషం.

**వృత్తిపై మమకారం** ప్రాథమిక విద్య నుంచే ఉపాధ్యాయ వృత్తిపై మమకారం పెరిగింది. ఉపాధ్యాయుడిగా ఎంపికై పలువురిని ప్రయోజకులుగా తయారు చేయాలని ఉండేది. 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు సాధించాను. స్కూల్ అసిస్టెంటుగా ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగించింది. ఇటీవల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా ఎంపికయ్యాను. టీటీసీ తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తిలోకి ఎంపికయ్యేలా సహాయం చేస్తున్నాను.
బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్

**సీనియర్ల స్ఫూర్తితో..** సీనియర్ ఉపాధ్యాయుల స్ఫూర్తితో నేను కూడా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివాను. బీఈడీ పూర్తి చేసి అనుకున్నది సాధించాను. కొన్నాళ్లపాటు మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే పని చేయడం ఎంతో సంతృప్తిని కలిగించింది. నా భార్య కూడా ఉపాధ్యాయురాలే. ఎవరైనా ఏదైనా అనుకుంటే అది సాధించే వరకూ ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి.

# ఉత్తరాలు రాసేద్దాం

గోదావరిఖని : లేఖ అంటే కేవలం కాగితం.. సిరా చుక్క మాత్రమే కాదు. దాని విలువెంటో చరవాణులు లేనికాలంలో ఉద్యోగ నియామక పత్రానికి ఎదురుచూసిన నిరుద్యోగికి, దూర ప్రాంతంలో ఉన్న కొడుకు యోగక్షేమాలపై కంగారు పడే తల్లిదండ్రులకే తెలుస్తోంది. పైగా చేతిరాతతో ఆలోచనశక్తి పెరుగుతోంది. ఈ డిజిటల్ యుగంలో లేఖల ప్రాధాన్యాన్ని తెలిపేలా తపాలా శాఖ ప్రయత్నం చేస్తోంది. జాతీయ స్థాయిలో 'డాయ్ ఆఖర్' పేరిట లేఖ రచన పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నగదు బహుమతులు అందజేస్తుంది.

**అంతా డిజిటల్ మయం**

ఈరోజుల్లో మనం సమాచారం పొందాలన్న.. చేరవేయాలన్న కంప్యూటర్లు, చరవాణుల మీద ఆధారపడుతున్నా. ముఖ్యంగా చరవాణుల వల్ల లేఖలకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చరవాణి చేతిలోకి వచ్చాక ఉత్తరాల వ్యవస్థ పూర్తిగా మరుగునపడింది. ఆన్‌లైన్‌లోనే సంక్షిప్త సమాచారాలు, మెయిళ్లు, ఫోన్‌తో మాట్లాడుకునే సదుపాయం వచ్చింది. ఇలా ఉత్తరాలకు ఆదరణ కరవైంది. ఈ నేపథ్యంలో ఉత్తరాల రచనపై ప్రజల్లో అవగాహన కల్గించడంతో పాటు చేతిరాతను ప్రోత్సహించేలా తపాలా శాఖ పోటీలు నిర్వహిస్తోంది.

**చివరి తేదీ డిసెంబరు 14**

లేఖ కవరుపైన వయసు రాసి, అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి.

DHAI AKHAR

National Level Letter Writing Competition

చీఫ్ పోస్టుమాస్టర్ జర్నల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్– 500001 చిరునామాకు డిసెంబరు 14వ తేదీలోపు లేఖలు పంపాలి.

**నిర్వహణ ఇలా..** ఈ ఏడాది 'డిజిటల్ వ్యవస్థలో ఉత్తరాల ప్రాధాన్యత(ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ డిజిటల్ ఏజ్)' అంశంపై పోటీలు నిర్వహిస్తున్నారు. ఆంగ్లం, హిందీతో పాటు వాడుక భాషలో చీఫ్ పోస్టు మాస్టర్‌కు ఉత్తరం రాయాలి.

18 సం.ల లోపు వారు ఒక కేటగిరీ.. 18 సం.ల పైబడిన వారు ఒక కేటగిరీగా రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయి.

ఏ4 కాగితంలో ఇన్‌లాండ్ లెటర్‌లో 500 పదాలకు మించకుండా, ఎన్విలప్‌లో వెయ్యి పదాలకు మించకుండా రాసి.. ఉత్తరాలు పంపాలి. సర్కిల్(రాష్ట్ర) స్థాయిలో 2025 జనవరి 23న ఫలితాలు వెల్లడిస్తారు. జాతీయ స్థాయి ఫలితాల తేదీని తర్వాత ప్రకటిస్తారు.

ఒక్కో కేటగిరీలో ముగ్గురి చొప్పున రాష్ట్ర(సర్కిల్), జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో రూ.25వేలు, రూ.10వేలు, రూ.5వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు ప్రదానం చేస్తారు. జాతీయ స్థాయిలో రూ.50వేలు, రూ.25వేలు, రూ.10వేలు అందజేస్తారు.

**అభినందనీయం**

లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాల ఎల్కలపల్లి తపాలా శాఖ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థి, యువతలో చేతిరాతపై ఆసక్తి పెరిగే అవకాశముంది. పోటీల్లో విద్యార్థులు, యువత పాల్గొనేలా విద్యాసంస్థలతో పాటు వివిధ వర్గాలు కృషి చేయాలి. గతంలో ఉత్తరాలతో వ్యక్తుల నడుమ అనురాగాలు, ఆప్యాయతలు పెంపొందేవి. ఉత్తరాల సంస్కృతిని కొనసాగించాలనే లక్ష్యంతో తపాలా శాఖ పోటీలు నిర్వహించడం అభినందనీయం.

**పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు..**

తపాలా శాఖకు పూర్వ వైభవం తీసుకురావడానికే ఈ పోటీలు నిర్వహిస్తోంది. ఒకప్పుడు చేతిరాతతో రాసిన లేఖలు బాంధవ్యాలను దృఢపరిచేవి. వ్యక్తుల మధ్య అనురాగం, ఆప్యాయత, అభిమానానికి ప్రతీకలుగా నిలిచేవి. వాటికి పెద్దపీట వేయడంతోపాటు దస్తూరికీ ప్రాధాన్యం ఇస్తున్నాం.పి.శివాజీ, జిల్లా తపాలా శాఖ పర్యవేక్షకుడు

# నాసిరకం.. నాణ్యతాలోపం

నిజామాబాద్ : గతుకుల రోడ్లు.. ధ్వంసమైన కాల్వలు.. ఖాళీ ప్రదేశాల్లో నిలిచిన మురుగు.. శివారు కాలనీలకు మట్టిరోడ్లు.. ఇదీ జిల్లాకేంద్రం పరిస్థితి. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆయా కాలనీల నుంచి వస్తున్న వినతులపై స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడారు. నగరపాలక సంస్థకు పన్నుల రూపేణ వస్తున్న నిధులను మౌలిక వసతుల కోసం కేటాయించేలా ఒప్పించారు. ప్రజలు కట్టిన పన్నులతో చేపడుతున్న పనులు ఇష్టారీతిన చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు.

**డివిజన్‌కు రూ.10 లక్షలు**

జిల్లా కేంద్రంలో 60 డివిజన్లు ఉన్నాయి. ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షల చొప్పున రూ.6 కోట్ల నిధులు కేటాయించారు. సగానికి పైగా డివిజన్లలో భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. కొన్నిచోట్ల ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. వీటితో పాటు గతంలో అపరిష్కృతంగా ఉన్న పనులు, సామాజిక భవనాలకూ నిధులు కేటాయించారు. ఈ స్థాయిలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతుంటే కనీస పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం.

**ఏఈలే బినామీలు..**

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఏఈలు(అసిస్టెంటు ఇంజినీర్లు) కొన్నేళ్లుగా బినామీ గుత్తేదారుల అవతారం ఎత్తారు. ఇప్పటికే ఇద్దరు ఏఈలను పర్యవేక్షణ చేయకపోవడం, బినామీలుగా మారడంతో గుర్తించి ఉన్నతాధికారులు పక్కనపెట్టారు. వారు పైరవీలు చేసుకొని మళ్లీ విధుల్లో చేరారు. కొన్నాళ్లుగా నిధులు, పనులు లేకపోవడంతో స్తబ్దుగా ఉన్నారు. ఇప్పుడు మౌలిక వసతుల కల్పనకు నిధులొచ్చాయి. ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాల్సిన వీరు.. బినామీ గుత్తేదారులుగా అవతారమెత్తారు.

**ఏం చేస్తున్నారంటే?**

నిబంధనల ప్రకారం ఓపీసీ(ఆర్డినరీ పోర్ట్‌ల్యాండ్ సిమెంటు)ను వినియోగించాలి కానీ, ఎక్కడా వాడటం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న సీసీరోడ్ల పనుల వద్ద కొన్ని సిమెంటు బస్తాలకు ఓపీసీ ఉంటే.. మరికొన్నిచోట్ల నోరుతిరగని పేరున్న బస్తాలు వాడుతున్నారు.నాలుగు రోజుల క్రితం సుభాష్‌నగర్‌లో పబ్లిక్‌హెల్త్ కార్యాలయం పక్కన సీసీ రోడ్డు నిర్మాణంలో కొన్ని సంచులు ఓపీసీ ఉంటే.. మిగతావి నాసిరకం బస్తాలు ఉపయోగించారు.

నుడా నిధులతో అయ్యప్ప ఆలయం ప్రహరీ నిర్మాణానికి సైతం నాసిరకం సిమెంటు వాడారు.ఆనంద్‌నగర్ పద్మశాలీ సంఘం సమీపంలో మురుగు కాల్వ నిర్మాణంలోనూ ఇదే పరిస్థితి. వంపులు తింపుతూ కాల్వ నిర్మిస్తున్నారు. ఇలా చేస్తే నీరు వెళ్లే పరిస్థితి ఉండదని కాలనీవాసులు వాపోతున్నారు.

**మా దృష్టికి తీసుకురండి**

నాణ్యతా లోపం ఉంటే మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. మీరు చెప్పిన విషయాలపై ఈ రోజే విచారణ చేయిస్తా. గతంలో బినామీగా మారి పనులు చేపడితే ఏఈని పక్కన పెట్టాం. మురుగు కాల్వలు, సీసీ రోడ్ల పనుల్లో సిమెంటుకు బదులు డస్టు వాడినట్లు తేలితే ఆ పనులు ఆపేస్తాం.

– మురళీమోహన్‌రెడ్డి, ఈఈ, నగరపాలక సంస్థ

# ఆయకట్టు కాల్వలు ఇలా.. సాగునీరు అందేదెలా!



ఎల్లారెడ్డిపేట: ప్రస్తుతం యాసంగి పనులను రైతులు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాల్లో నార్లు పోయడం, పొలాలను దున్నే ప్రక్రియ క్రమంగా ఊపందుకుంటోంది. యాసంగి సీజన్‌లో చెరువులు, కుంటల నుంచి ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే ఆయకట్టు కాల్వలు పూడికతో నిండిపోయాయి. చెట్లు పెద్ద మొత్తంలో పెరిగి కాల్వలు కనిపించకుండా అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కాల్వలు అధ్వానంగా తయారవడంతో నీరు పొలాలకు చేరని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో బోరుబావులు, ఓపెన్ బావులపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. జిల్లాలో చాలా చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. అక్టోబరులో జిల్లాలో భూగర్భ జలాలు సగటున 5.83 మీటర్లలో ఉన్నాయి. యాసంగి సీజన్‌లో జిల్లాలో పంటల సాగు ప్రణాళికను అధికారులు రూపొందించారు.

వరి 1,74,311 ఎకరాల్లో, మొక్కజొన్న 1431, నువ్వు 362, పొద్దుతిరుగుడు 810, శనగ 178, ఇతర పంటలు 317 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతాయని అంచనా వేశారు.

ఓవైపు నీటి వనరుల్లో సమృద్ధిగా నీరుండటం, భూగర్భజల మట్టాలు ఆశాజనకంగా పెరిగినా జిల్లాలోని కొన్ని మండలాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. తలాపునే నీటితో కళకళలాడే చెరువులున్నా భూగర్భజల మట్టాలు తగ్గిపోతుంటాయి. ఆయకట్టు కాల్వల్లో నీరు పారితేనే బోరుబావులు రీఛార్జి అవుతుంటాయి.

తలాపునే గోదారి ఉన్నా నీరు వదలకపోతే బీడు భూములుగా మారే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే చాలా వరకు బోరుబావులు తక్కువగా పోస్తున్నాయి. ప్రస్తుతం బోరు బావుల ఆధారంగా రైతులు సాగును ప్రారంభించారు. ఒకవేళ నీటి విడుదల ఆలస్యమైతే బోరుబావులు మొండికేసి, వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఆయకట్టు కాల్వల గుండా సాగునీరు ప్రవహిస్తేనే బోర్లలో జలధార పెరుగుతుందని చెబుతున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువు కట్ట పొడవు 600 ఎకరాలు. దీని కింద రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, సర్వేయపల్లిలో 494 ఎకరాల ఆయకట్టు ఉంది. వ్యవసాయ పొలాలకు సాగునీరు అందించే కాల్వ పూడికతో నిండిపోయింది. పైగా ఇరువైపులా చెట్లు విపరీతంగా పెరిగిపోయి అపరిశుభ్రంగా మారి, కనిపించకుండా తయారైంది. ఇది ఒక్కటే కాదు. జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొన్నా పూడిక తీసిన దాఖలాలు లేవు.

**వెంటనే పనులు ప్రారంభించాలి**

జక్కుల చెరువు ఆయకట్టు కాల్వలో పూడిక తీత పనులను వెంటనే ప్రారంభించాలి. ఈ ప్రాంతంలో కాల్వ గుండా నీరు పారితేనే బోరుబావుల్లో నీరు ఉబుకుతుంది. ప్రస్తుతం కాల్వ కింది భాగాన ఉండే చాలా మంది రైతులు నార్లు పోసి, పొలాలను దున్నడం ప్రారంభించారు. ఆయకట్టుకు నీరందించే ప్రక్రియ ఆలస్యమైతే బోర్లు ఎత్తిపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే కనీసం నారుమడులను తడపడం కూడా కష్టం అవుతుంది. అధికారులు వెంటనే స్పందించాలి.

**ఎల్లయ్య, రైతు, రాచర్ల బొప్పాపూర్**

**నివేదికలు రూపొందించాం**

మండలంలోని అక్టోబరు 2 నుంచి నవంబరు 3 వరకు వివిధ పనులను గుర్తించాం. అనేక గ్రామాల్లో ఆయకట్టు కాల్వల్లో పూడికతీత, వాటిని శుభ్రపర్చడంతోపాటు ఇతరత్రా పనులకు గ్రామ సభల్లో తీర్మానం చేశాం. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులకు అంచనాలు తయారు చేశాం. నిధుల మంజూరు కోసం త్వరలోనే ప్రభుత్వానికి పంపిస్తాం. ఆయకట్టు కాల్వల్లో పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేస్తాం.

కొమురయ్య, ఏపీవో, ఈజీఎస్

# కూరగాయలసాగు.. లాభాలు బాగు



పెద్దపల్లి : మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల సాగు చేస్తూ కాల్వశ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామ పరిధిలోని ఊషన్నపల్లి రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. గతంలో పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసి దిగుబడి రాకపోవడంతో ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు.. ఆది నుంచి ఏ పంట వేసినా తెగుళ్లు సోకి దిగుబడులు రాక, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వాతావరణ మార్పుతోపాటు వర్షాభావ పరిస్థితులు కర్షకులను కూరగాయాల సాగుపై దృష్టి సారించేలా చేశాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలకు మంచి ధరలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమకు లాభాల పంట పండుతోందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 500 మంది రైతులు ఉంటారు. ఇందులో 100 మందికి పైగా కూరగాయలు సాగు చేస్తున్నారు. గ్రామంలో సుమారు 16 వందల ఎకరాల విస్తీర్ణం ఉంటుంది. 60 ఎకరాలకు పైగా కూరగాయలను పండిస్తున్నారు.

**డిమాండ్‌ను పసిగట్టి..**

రైతులు వ్యూహాత్మకంగా కూరగాయల సాగు చేస్తున్నారు. మార్కెట్లో ఏ సీజనులో వేటికి డిమాండ్ ఉంటుందో పసిగట్టి ఆ నారు పోస్తున్నారు. సాగు వ్యయాన్ని తగ్గించుకునేందుకు వీలుగా కూలీలపై ఆధారపడకుండా కుటుంబ సభ్యులే ప్రారంభం నుంచి పంట ముగిసే వరకూ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పెద్దపల్లి మార్కెట్‌తోపాటు కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఓదెల మండలాల్లోని గ్రామాల్లో వారాంతపు సంతల్లో విక్రయిస్తున్నారు. టమాట, బెండ, మిరప, బీర, కాకర, సొరకాయ, మెంతి, పాలకూర, వంకాయ, క్యారెట్, చిక్కుడు, కాలీఫ్లవర్ తదితరాలు సాగు చేస్తున్నారు. కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండటంతో తమకు లాభాలు వస్తున్నాయని అన్నదాతలు చెబుతున్నారు.

**శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి**

పండించిన కూరగాయలను నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం గ్రామాల్లో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. కూరగాయల లభ్యత ఎక్కువ ఉన్నప్పుడు, ధర తక్కువ ఉన్న సమయంలో శీతల గిడ్డంగులు ఉంటే రైతులు కూరగాయలను నిల్వ ఉంచుకొని ధర వచ్చినప్పుడు విక్రయించుకునే వెసులుబాటు కలుగుతుంది. మా కుటుంబ సభ్యులందరం కలిసి 2 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తాం. మార్కెట్ సీజన్ చూసి కూరగాయ విత్తనాలు నాటుతాం.రైతు, ముస్కు శ్రీనివాస్

**రోజు వారీ ఆదాయం**

అర ఎకరంలో టమాట, బెండ, వంకాయ, మిర్చి సాగు చేశాను. పత్తి సాగు కంటే కూరగాయల సాగులోనే లాభాలు అధికంగా ఉన్నాయి. కూరగాయల విక్రయంతో రోజూ ఆదాయం వస్తుంది. దీంతో పత్తి సాగుకు పెట్టుబడి సమస్య ఉండటం లేదు. ఎప్పటికప్పుడు కూలీలకు డబ్బు చెల్లిస్తున్నాం. కష్టపడితే కూరగాయల సాగు లాభసాటిగా ఉంటుంది.రైతు, ముష్కె అశోక్

# మిగిలింది వంతెన ఆనవాళ్లే..!

తిరుమలాయపాలెం : ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల మధ్యలో ఆకేరుపై మూడున్నరేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.12 కోట్లతో వంతెన నిర్మించింది. దీన్ని అధికారికంగా ప్రారంభించకముందే ఇటీవల వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. సుమారు 10 పిల్లర్లు తూర్పు దిశకు వంగి ప్రమాదకరంగా మారాయి. రెండు జిల్లాల మధ్య రాకపోకలు సాగించే వారికి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు, జల్లేపల్లి, హైదర్‌సాయిపేట, రావిచెట్టుతండా నుంచి మహబూబాబాద్ జిల్లా ధర్మారం, కురవి, సీరోలు, డోర్నకల్ వెళ్లేందుకు వీలుగా ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడేది. వంతెన నిర్మాణానికి ముందు వాహనదారులు, చిరు వ్యాపారులు, రైతులు మరిపెడ (బంగ్లా)కి వెళ్లి చుట్టూ తిరగటం వల్ల సుమారు 50 కి.మీ. దూరభారం పెరిగేది. వంతెన నిర్మాణంతో దూరభారం తగ్గటంతో పాటు ప్రధాన రహదారికి సమీపంలోని భూముల విలువ పెరిగింది. రెండు జిల్లాలను కలుపుతూ ఆకేరుపై వంతెన నిర్మించటం వల్ల మాబాధలు తీరాయని అనుకున్నాం. అంతలోనే వరదలకు వంతెన కొట్టుకుపోయింది. మళ్లీ మాకు పాతరోజులే వచ్చాయి. అధికారులు స్పందించి వంతెనను త్వరితగతిన పునర్నిర్మించాలి.

గుగులోతు శంకర్, రావిచెట్టుతండా

వరద ఉద్ధృతి తగ్గిన తరువాత అక్కడి పరిస్థితిని పరిశీలించాం. వంతెన పునర్నిర్మాణంపై ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు ఆకేరుపై వంతెన నిర్మాణ పనులు చేపడతాం.

సరస్వతి, జేఈ, ఆర్అండ్‌బీ

# పొదుపు పాఠాలు!

కరీంనగర్ : రూపాయి రూపాయి పొదుపు చేస్తే అది వందలు.. వేలల్లో నుంచి లక్షల్లోకి మారుతుంది. పొదుపు ద్వారా అత్యవసర, భవిష్యత్తు అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం వెదుకులాడుకునే పని లేకుండా చేస్తుంది. జీవిత గమనాన్ని మార్చే డబ్బు పొదుపును ప్రతి ఒక్కరూ పాటించాల్సిందే. ముఖ్యంగా బాల్యం నుంచే ఈ అలవాటు చేయాలి. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో వారికి పొదుపు పాఠాలు అంతే అవసరం. అదే పనిని ఉమ్మడి జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో ఆచరిస్తున్నారు. చదువుతోపాటు ఆర్థిక పాఠాలను కూడా ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారు.

**ఆర్థిక క్రమశిక్షణతో భవిష్యత్తుకు భరోసా**

ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల పాఠశాలలు 1071 ఉండగా, వాటిల్లో 1,57,648 మంది బాలలు చదువుతున్నారు. క్రమశిక్షణ, చదువు, వ్యక్తిత్వ వికాసం వంటివి బడుల్లో అందుతున్నా బాలలకు ఆర్థిక క్రమశిక్షణ నేర్పడం లేదు. బాల్యం నుంచి పాటించే అలవాట్లు భవిష్యత్తులో కూడా వాటినే పాటిస్తారు. బాల్యం నుంచి ఉన్నత విద్యాభ్యాసం వరకు విద్యార్థులు తల్లిదండ్రులు లేదా ఉపకార వేతనాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. పేద, ఆర్థికంగా చితికిన గ్రామీణ కుటుంబాల విద్యార్థుల్లోనూ భవిష్యత్తు చదువులు, కోచింగ్, స్టడీ మెటీరియల్, ఇతరత్రా అవసరాల కోసం కొంత సొమ్మును దాచుకోవాలనే అవగాహన ఉండటం లేదు. ఎదిగిన కొద్దీ ఫ్యాషన్ పోకడలను పుణికి పుచ్చుకుంటున్న యువతరం చరవాణి కొనివ్వలేదని, బైక్ కొనేందుకు డబ్బులివ్వలేదని క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుని తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్న సంఘటనలు ఉమ్మడి జిల్లాలో చూస్తున్నాం. చిన్నప్పటి నుంచే డబ్బు విలువ, పొదుపు అవసరం నేర్పితే విద్యార్థులు ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండదు.

**డబ్బు విలువ తెలిసేలా..**

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తక్కల్లపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్థిక పాఠాలను నేర్పిస్తున్నారు. విద్యార్థులు చేతి ఖర్చుల కోసం, ఇతర అవసరాల కోసం పొందే డబ్బుల నుంచి కొంత మొత్తాన్ని పొదుపు చేసుకునేలా ఆరో తరగతిలో వారు ప్రవేశం పొందిన నాటి నుంచే ప్రోత్సహిస్తున్నారు. పోస్టాఫీసులో వారికి తోచిన మొత్తాన్ని దాచుకునేలా చేస్తున్నారు. విద్యార్థులే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు సంచయిక పథకం కింద బడి పేరుతో తీసిన ఖాతాలో విద్యార్థులు దాచుకోవాల్సిన డబ్బులను ఓ ఉపాధ్యాయుడి ద్వారా సేకరించి వాటిని అందులో జమ చేస్తున్నారు. ఇందు కోసం విద్యార్థులకు పాకెట్ పాస్ బుక్‌ను జారీ చేస్తున్నారు. పొదుపు చేసిన మొత్తం నుంచి విద్యార్థులకు అవసరమైనప్పుడు డబ్బులను తీసి ఇస్తున్నారు. 12 ఏళ్ల నుంచి ఈ విధానం కొనసాగుతుండటంతో విద్యార్థులు సొమ్ములను దాచుకుంటూ వారి చిన్న చిన్న అవసరాలకు తల్లిదండ్రులపై ఆధారపడకుండా స్టడీ మెటీరియల్, విజ్ఞాన, విహార యాత్రల కోసం వాటిని వాడుకుంటున్నారని ప్రధానోపాధ్యాయుడు ఎం.రవీందర్ తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 450 మంది విద్యార్థులు పైగా ఇలా చేశారని ప్రస్తుతం 60 మంది బాలలు ఇలా పొదుపు చేసుకుంటున్నారని వివరించారు.

**ఆర్థిక క్రమశిక్షణ నేర్పాలని...**

గంగాధర మండలం ఒద్యారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు పొదుపు పాఠాలను నేర్పిస్తున్నారు. నిత్యం చిరుతిళ్ల కోసం డబ్బులను ఖర్చు చేస్తున్న బాలలను చూసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రావు ప్రత్యేకంగా వారికి ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేయాలనుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు సమీప బ్యాంకులో వారికి తోచినంత డబ్బులను దాచుకునేలా ప్రోత్సహించారు. బ్యాంకు అధికారులు కూడా అండగా నిలిచి పాఠశాలకే వచ్చి 28 మంది విద్యార్థులకు బ్యాంకు ఖాతాలను ఉచితంగా అందించారు. విద్యార్థుల డబ్బు ఖాతాలో జమ చేసేందుకు ఒక ఉపాధ్యాయుడికి బాధ్యతలు అప్పగించారు. దీంతో విద్యార్థులు దుబారా ఖర్చులను తగ్గించి పొదుపు చేసుకుంటున్నారని ప్రభాకర్ రావు తెలిపారు.

**బడి బ్యాంకులు తెరవాలి**

గతంలో ఉమ్మడి జిల్లాలో బడి బ్యాంకులు, పోస్టాఫీసుల్లో సంచయిక పథకాలను బాలల ముంగిట నిలిపి పొదుపు వైపు ప్రోత్సహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఉపాధ్యాయులు చొరవ చూపితేనే బడి బ్యాంకులు సాధ్యమవుతాయి.

చదువులకు అంతరాయం కలగకుండా విద్యార్థులే బడి బ్యాంకు వ్యవహారాలను కొనసాగించేలా చూడాలి.

ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడితో పర్యవేక్షణ చేయించాలి.

**ప్రయోజనాలు ఇలా..** విహార యాత్రలు, జన్మదిన వేడుకలకు సొంతంగా డబ్బులు సమకూర్చుకోవడంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

చదువుకు అవసరమైనవి సొంతంగా కొనుగోలు చేసుకుంటారు. ఈ క్రమంలో కచ్చితంగా అవసరమైనవే కొంటారు.చిరుతిళ్లను మానుకుని ఆరోగ్యంగా ఉంటారు.బ్యాంకు కార్యకలాపాలు, లావాదేవీల గురించి అవగాహన కలుగుతుంది.

# అటకెక్కిన ఆర్థిక సాయం

ఖమ్మం: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులకు అందించాల్సిన ఉద్యోగ విరమణ ఆర్థిక సాయం అటకెక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున ఇస్తామని ప్రకటించింది. అయితే అందుకు సంబంధించి నిధులు మంజూరుకాలేదు. ఇప్పటికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఉద్యోగం నుంచి తొలగించారు. 2024 జులై 1 నుంచి జీతభత్యాలను నిలిపేశారు.

**ఉభయ జిల్లాల్లో 359 మంది..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 65ఏళ్ల వయసు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 359 మంది వివరాలు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. వచ్చే ఏప్రిల్ 1 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. గతంలో 70 ఏళ్లు దాటినా విధులు నిర్వర్తించేవారు. స్వచ్ఛందంగా పని చేయలేమని విరమించుకున్న అంగన్‌వాడీ టీచర్లకు రూ.60వేలు, ఆయాలకు రూ.30వేల చొప్పున సర్కారు చెల్లించేది. ప్రసుత్తం ఐసీడీఎస్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసును నిర్ణయించి, రిటైర్‌మెంట్ సమయంలో అందించే ఆర్థిక సాయాన్ని పెంచినా అమలుపరచటంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. **సిబ్బంది ఆందోళనలతో..** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ అనంతరం ఎలాంటి ఆర్థిక సాయం పొందేవారు కాదు. అందుకే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ సమయంలో ఉపాధ్యాయులకు రూ.5లక్షలు, ఆయాలకు రు.2లక్షల చొప్పున ఆర్థిక సాయమందించాలని గతంలో ఆందోళన బాటపట్టారు. అప్పటి భారాస ప్రభుత్వం స్పందించి సిబ్బంది ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లుగా నిర్ణయించింది. ఉద్యోగ విరమణ సమయంలో టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేల చొప్పున ఆర్థిక సాయమందించాలని ఉత్తర్వులు వెలువరించింది. సమ్మెకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సైతం కనీస వేతనం రూ.18వేల చెల్లింపుతో పాటు వివిధ హామీలు గుప్పించింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. గత జులైలో టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చింది.

# రూ.1,230 కోట్ల రాయితీ.. వచ్చింది రూ.75 కోట్లే

హైదరాబాద్: ఏళ్లుగా పేరుకుపోయిన రూ.కోట్ల మొండి బకాయిలు రాబట్టుకునేందుకు జలమండలి చేసిన వన్‌టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) ప్రయత్నాలకు వినియోగదారుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. రెండు నెలలు అవకాశం ఇచ్చినా రూ.100 కోట్లు వసూలు కాకపోవ డం గమనార్హం. ఏడు లక్షలమంది బకాయిదారుల్లో లక్షమందిలోపే వినియోగించుకోవడటం గమనార్హం. బకాయిలు వాటి వడ్డీ, అపరాధ రుసుంతో కలిపి మొత్తం రూ.1792 కోట్లు వసూలు కావాల్సి ఉండగా.. ఈ మొత్తంలో రూ.1230 కోట్ల రాయితీని జలమండలి ఓటీఎస్ ద్వారా ఇచ్చింది. రూ.562 కోట్లు వసూలు కావాల్సి ఉండగా సుమారు రూ.75 కోట్లు మాత్రం వసూలైంది. ఓటీఎస్‌కు ఆఖరు రోజైనా స్పందన ఆశించినంతలేక



పోవడం జలమండలి అధికారులను నిరాశకు గురి చేసింది.

**బకాయిలపై కింకర్తవ్యం**ఓటీఎస్ ముగుస్తున్న నేపథ్యంలో సుమారు ఆరు లక్షలమంది బకాయి దారుల నుంచి వసూలుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై అధికారులు దృష్టి సారించారు. కనెక్షన్లు తొలగించాలా.. మరోమారు నోటీసులిచ్చి రికవరీ అమలు చేయాలా?అని పరిశీలిస్తున్నారు. డిసెంబరు 1 నుంచి చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు త్వరలో మోక్షం

హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు త్వరలో మోక్షం లభించనుంది. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. వచ్చేనెల మొదటివారం తరవాత దరఖాస్తుల పరిశీలన చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4.50 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించి ప్రస్తుత బడ్జెట్‌లో నిధులను కూడా కేటాయించింది. ఇళ్ల కోసం ఇప్పటివరకు సుమారు 82.83 లక్షల దరఖాస్తులు అందాయి. ఈ పథకానికి ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించనుంది. అందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ నిపుణులు కసరత్తు చేస్తున్నారు.



**స్థలం ఉన్న అర్హులెందరు?..** రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో ముందుగా స్థలం ఉన్నవారిని గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనల మేరకు ఎంతమంది అర్హుల్లో జాబితా సిద్ధం చేయాలని స్పష్టం చేయడంతో అధికారులు అర్హులను గుర్తించే పనిలో ఉన్నారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలో ఏయే పథకాన్ని కోరుకుంటున్నారన్న వివరాలను అధికారులు కంప్యూటరీకరించారు. స్థలం ఉన్నవారిని తొలుత గుర్తిస్తారు. అర్హులకు ఇళ్లను కేటాయించే విషయంలో నియోజకవర్గం స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను నియమించాలని ప్రభుత్వం ఇంతకు మునుపే ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో ఈ కమిటీలు ఉంటాయి. రెండు, మూడు జిల్లాల్లో మినహా ఆ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను డిసెంబరు మొదటి లేదా రెండోవారం నుంచి చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ తరవాత ఇళ్ల కేటాయింపులు చేపడతారు. నిర్మించాల్సిన ఇంటి నమూనాతోపాటు అందుకు సంబంధించిన విధివిధానాలను సైతం జారీ చేసింది. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కదలిక రానుంది.

# నొక్కేస్తున్నారు

కామారెడ్డి : ధాన్యం తక్కువగా వస్తుందంటూ మిల్లర్లు గతంలో కోతలు విధించేవారు. కానీ ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో కాంటా వేసిన ధాన్యం మిల్లుకు చేరుకునేలోపే మధ్యలోనే మాయం అవుతోంది. రవాణా చేస్తున్నప్పుడే కొందరు డ్రైవర్లు చాకచక్యంగా బస్తాలను లారీ నుంచి తీస్తున్నారు. లారీని తూకం వేసినప్పుడు ధాన్యం క్వింటా మేర తక్కువగా వస్తే మిల్లర్లు పెద్దగా పట్టించుకోరు. అంతకంటే ఎక్కువ తేడా వస్తేనే అభ్యంతరం చెబుతారు. దీనినే అదునుగా తీసుకుంటున్న కొందరు లారీ డ్రైవర్లు యజమానులకు తెలియకుండా మధ్యలో ఒకట్రెండు సంచుల ధాన్యాన్ని నొక్కేస్తున్నారు.

**రైతుదేనా బాధ్యత..?**తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలో ఎక్కించే వరకు రైతు బాధ్యత తీసుకుంటాడు. రైతుల వివరాలు, లారీలో బస్తాల సంఖ్యతో నిర్వాహకులు ట్రక్‌షీట్ రూపొందిస్తారు. లారీ మిల్లుకు చేరితే ట్రక్‌షీట్ సరిచూసుకుని మిల్లరు ఆమోదముద్ర వేస్తాడు. రైతుకు మాత్రం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి రసీదు ఇవ్వడం లేదు. మిల్లులో ధాన్యం దింపుకొనే వరకు రైతులనే బాధ్యులుగా చేస్తున్నారు. రైతులకు రసీదులు ఇవ్వాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవల అధికారులకు ఆదేశించినా ఎవరూ పాటించడం లేదు. ధాన్యం లోడ్ చేసిన తర్వాత కొనుగోలుకేంద్రం నిర్వాహకులు ట్రక్‌షీట్‌తో మిల్లు వరకు లారీతో వెళ్లాల్సి ఉంటుంది. కానీ చాలా మంది ఇలా వెళ్లకుండా డ్రైవర్ చేతికే ట్రక్‌షీట్ ఇచ్చి పంపిస్తున్నారు. 'మాచారెడ్డి మండలం కొత్తపేట రైతుల ధాన్యం బస్తాలు ఎందుకు తక్కువగా వచ్చాయో తెలుసుకుంటాం. పూర్తి విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.' అని పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్ అన్నారు.'మాచారెడ్డి మండలం కొత్తపేటకు చెందిన రైతులు (నర్సయ్య, ఎల్లయ్య, రాజు, శంకర్, బాబు) 650 బస్తాల ధాన్యాన్ని ఈ నెల 18న కాంటా వేసి లారీలో పల్వంచలోని ఓ మిల్లుకు పంపించారు. మరుసటి రోజు మిల్లు నుంచి రైతులకు ఫోన్ వచ్చింది. బస్తాల తూకం తక్కువగా ఉందని చెప్పారు. వెంటనే రైతులు అక్కడకు వెళ్లి లారీని చూసే సరికి బస్తాలు కిందపడకుండా కట్టిన తాడు విప్పి ఉంది. లారీలోని బస్తాలు లెక్కించగా 637 మాత్రమే వచ్చాయి. దీంతో రైతులు లారీ డ్రైవర్‌ను నిలదీశారు. వెంటనే లారీ యజమాని వచ్చి తక్కువ వచ్చిన బస్తాలకు నగదు రూపంలో పరిహారం చెల్లిస్తానని అన్నాడు. రైతులు సరేనన్నారు. రెండు రోజుల తర్వాత లారీ యజమాని ఇవ్వనని తెగేసి చెప్పాడు. బస్తాలు తక్కువగా వస్తే మాకేం సంబంధమని ఎదురు ప్రశ్నించాడు. దీంతో రైతు నర్సయ్య పౌరసరఫరాలశాఖ సహాయ కేంద్రానికి ఈ నెల 25వ తేదీన ఫోన్ చేసి జరిగిన విషయం వివరించాడు.'

# అభివృద్ధి చాటేలా.. ఆరంభం అదిరేలా



హైదరాబాద్: రాజధానిలో ఏడాది పాలన, సాధించిన పురోగతిని నివేదించేందుకు విభాగాల వారీగా బల్దియా ఉన్నతాధికారులు నివేదికలు రూపొందించారు. పలు కీలక ప్రాజెక్టులు ప్రారంభమవుతుండగా, మరికొన్నింటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన ఉంటుందని బల్దియా స్పష్టం చేస్తోంది. అందులో జూపార్కు-ఆరాంఘర్ పైవంతెన, వరద ముంపును అరికట్టే భూగర్భ జలాశయాల ప్రారంభోత్సవాలు ఉన్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ నిర్మించనున్న పైవంతెనలకు శంకుస్థాపన ఉంటుందని, ఆయా కార్యక్రమాలను ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 3న నిర్వహించనున్నట్లు బల్దియా పేర్కొంటుంది.

మూడేళ్ల కిందట జూపార్కు నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు 4కి.మీ పొడవు, ఆరు లైన్ల వెడల్పుతో పైవంతెన నిర్మాణాన్ని గత సర్కారు ప్రారంభించింది. నిధుల కొరతతో పనులు ముందుకు సాగలేదు. సర్కారు తోడ్పాటుతో పైవంతెన నిర్మాణం పూర్తయిందని, సర్వీసు రోడ్డును అందుబాటులోకి తీసుకొచ్చి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని ఇంజినీర్లు చెబుతున్నారు.

**ఎట్టకేలకు శంకుస్థాపన..**

హెచ్-సిటి పేరుతో కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జూబ్లిచెక్‌పోస్ట్, కేబీఆర్ పార్కు మెయిన్ గేట్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి కూడలి, మహారాజ అగ్రసేన్ కూడలి, ఫిల్మ్‌నగర్ చౌరస్తా, రోడ్డు నెం.45 చౌరస్తాల్లో రూ.826 కోట్లతో పైవంతెనలు, అండర్‌పాస్‌లను నిర్మించేందుకు నిర్ణయం తీసుకుంది. పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**ముంపు కష్టాలను తీర్చే..**

నగరంలోని 12 చోట్ల పది లక్షల లీటర్ల నుంచి 40లక్షల లీటర్ల వరదను నిల్వ చేసుకోగల భూగర్భ నీటి ట్యాంకుల పనులు చేపట్టగా.. కేసీపీ జంక్షన్, రాజ్‌భవన్ రోడ్డు, లేక్‌వ్యూ గెస్ట్‌హౌజ్, సెక్రటేరియట్ చౌరస్తాల్లో నిర్మించిన వాటి పనులు పూర్తయ్యాయి. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా వీటిని ప్రారంభించనున్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. **సుందరీకరణ పనులు పూర్తి..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రూ.178.88కోట్లతో 329 సుందరీకరణ పనులు మొదలయ్యాయని, కూడళ్ల సుందరీకరణ, విభాగినిలపై పచ్చదనం, కాలిబాటల అభివృద్ధి, పైవంతెనలకు రంగులు, ఇతరత్రా పనులు తుది దశకు చేరుకున్నాయని, వాటిని ఉత్సవాల్లో భాగంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేస్తోంది.

**శిల్పారామం నైట్‌బజార్ వచ్చేస్తోంది**

శిల్పారామంలోని నైట్‌బజార్‌కు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. దాదాపు 8 ఏళ్లుగా మూతపడిన దుకాణాలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇందిరా మహిళా శక్తి బజార్ పేరిట డిసెంబర్ మొదటి వారంలో అందుబాటులోకి రానుంది. నైట్‌బజార్ ప్రాంగణంలో చకచకా మరమ్మతులు చేయిస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి మూతపడిన నైట్‌బజార్‌ను పరిశీలించారు. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. స్వయంసహాయక మహిళా సంఘాలకు ఇక్కడ దుకాణాలు కేటాయించాలని నిర్ణయించారు. దీంతో నైట్‌బజార్‌లో ఇటీవల మరమ్మతులు ఆరంభించారు. డిసెంబర్ 5న సీఎం చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై అధికారుల సమీక్ష**

బాచుపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ ఏర్పాట్లపై శుక్రవారం వర్సిటీ అధికారులు సమీక్షించారు. పనులను పర్యవేక్షించారు. ట్రాఫిక్ పోలీసులు, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

# బ్యాంకుల్లో సొమ్ము భద్రమేనా..?




హైదరాబాద్ : " ఇటీవల వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకులో దోపిడీ దొంగలు రూ.15 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు అపహరించారు. బ్యాంకు దగ్గర సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో చోరీ జరిగిందని పోలీసులు గుర్తించారు." ఈ ఘటన నగరంలోని బ్యాంకుల దగ్గర భద్రతా లోపాలను బయటపెడుతోంది. చేయగా కొన్ని లోపాలు వెలుగుచూశాయి. జీవితాంతం కష్టపడి సంపాదించిన డబ్బు, మోజుపడి కొనుక్కున్న బంగారం, ఇతర ఆభరణాలు.. బ్యాంకు లాకర్లో భద్రంగా ఉంటాయని భావిస్తాం. అలాంటి బ్యాంకుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..

**గుర్తించిన లోపాలు**

బ్యాంకులు మూసేసిన తర్వాత వెలుపల సెక్యూరిటీ గార్డులు కనిపించలేదు. కొన్ని చోట్ల రాత్రి 10 దాటినా భద్రతా సిబ్బంది రాలేదు.

నిర్మానుష్య ప్రాంతాల దగ్గర ఏర్పాటు చేసిన బ్యాంకు శాఖల దగ్గర భద్రతా ఏర్పాట్లు కనిపించలేదు.ఏటీఎంల దగ్గర ఎక్కడా రక్షణ చర్యలు లేవు. కొన్ని ప్రాంతాల్లో ఆకతాయిలు తిష్ఠ వేశారు.

కొన్నిచోట్ల సెక్యూరిటీ సిబ్బంది నిద్రపోతూ కనిపించారు.

ఆర్‌బీఐ నిబంధనలివీ

బ్యాంకు శాఖ ప్రారంభించాలంటే ఆ భవనంలో స్ట్రాంగు రూము నిర్మించాలి. అది పూర్తిగా ఇంజినీర్ పర్యవేక్షణలోనే నిర్మాణం జరగాలి. భవనం ప్రధాన ద్వారం ఒకటే ఉండేలా నిర్మించాలి.

ఉదయం బ్యాంకు షట్టర్ పైకెత్తాక లాక్ చేసేలా భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేయాలి.

బ్యాంకు పరిసరాలతో పాటు లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. బ్యాంకు మూసివేసే సమయంలో అలారం 'నైట్ మోడ్' ఉందో లేదో సరి చూడాలి. అలారం ఆధునిక పద్ధతిలో అమర్చితే దొంగలకు కనిపించకుండా ఉంటుంది. లేదంటే ధ్వంసం చేస్తారు.

స్ట్రాంగ్ రూంలో ఎవరైనా దాగి ఉండే అవకాశం ఉంటుంది. అందుకే బ్యాంకు మూసివేస్తున్నప్పుడు నిశితంగా పరిశీలించాలి. లాకర్స్ తాళాలను సరి చూడాలి.

రాత్రివేళ జన సంచారం ఎక్కువ లేని చోట ఉన్న బ్యాంకు శాఖల చుట్టూ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలి.

పురాతన భవనాల్లో ఉన్న బ్యాంకు భవనాల పునర్నిర్మాణం విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

ఏటీఎంలు, బ్యాంకుల దగ్గర కచ్చితంగా భద్రతా సిబ్బందిని నియమించాలి.పరిశీలించిన ప్రాంతాలు, సమయం: అశోక్‌నగర్, నాచారం, మల్లాపూర్, గాంధీనగర్, హబ్సిగూడ, కొత్తపేట, హెచ్‌ఎంటీనగర్, ఎల్‌బీనగర్. సాయంత్రం 6 నుంచి 11 గంటల మధ్య.

# రెక్కీ చేశాం.. పట్టుకుపోతాం!

హైదరాబాద్: 'డిజిటల్ అరెస్ట్' అంటూ సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ లక్ష్యంగా చేసుకొని సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. నగర సైబర్‌క్రైమ్‌లో నమోదవుతున్న కేసుల్లో అధికభాగం ఇవే ఉంటున్నాయి. సీబీఐ, ఈడీ, ఎన్‌ఐఏ, సైబర్‌క్రైమ్ పోలీసులమంటూ యూనిఫాం ధరించి తేలికగా బోల్తా కొట్టిస్తారు. తమ ఆదేశాలు ధిక్కరించినా కుటుంబమంతా చిక్కుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తారు. డ్రగ్స్, మనీలాండరింగ్ అంశాలను బూచిగా చూపి అక్రమ నగదు లావాదేవీలు జరిగాయంటారు. తాము సూచించిన ఖాతాలకు నగదు జమచేస్తే ఆ లావాదేవీలను పరిశీలించి తిరిగి డబ్బంతా ఇస్తామంటూ స్వాహా చేస్తున్నారు. చేయని నేరానికి జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందనే భయంతో బాధితులు మౌనంగా ఉంటున్నారు. గంటలు, రోజుల తరబడి ఇంటిగడప దాటకుండా భయాందోళన మధ్య గడుపుతున్నారు. ఇంతగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కేటుగాళ్లు.. ప్రస్తుతం రూటు మార్చారు. బాధితుల నగదు చెల్లించటంలో ఆలస్యం చేసినా, ప్రశ్నలు వేసినా కొత్త అస్త్రం ఉపయోగిస్తున్నారు. తమ శాఖ అధికారులు గుమ్మం వద్ద సిద్ధంగా ఉన్నారని, మీ కదలికలను వీడియో రికార్డు చేస్తున్నారంటూ బెదిరిస్తున్నారు. ఇప్పటికే రెక్కీ నిర్వహించామని, దర్యాప్తునకు ఏమాత్రం సహకరించకపోయినా కారులో ఎత్తుకెళ్తామంటూ బెంబేలెత్తిస్తున్నారు.

**కొత్తవారు కనిపిస్తే బాధితుల్లో కలవరం**

డిజిటల్ అరెస్ట్ పేరిట మోసపోయిన బాధితులు మానసిక కుంగుబాటుకు



గురవుతున్నారని సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపారు. నగదు నష్టపోవటం, రోజుల తరబడి గదికే పరిమితమైన వారు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు. తమ ఇంటిబయట, కాలనీలో కొత్తవారు కనిపిస్తే తమను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసు అధికారులే అనే భ్రమలో ఉండిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సమయంలో వారిని కూర్చోబెట్టి కొంతసేపు కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

# ఆటోనగర్.. ఏదీ నజర్!

పెద్దపల్లి : అంతర్గాం మండలం కుందనపల్లిలో ఆటోనగర్ ఏర్పాటు కలగానే మారింది. ఒకే ప్రాంగణంలో ఆటోమొబైల్ దుకాణాలు, మెకానికల్ షెడ్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో వేసిన శిలాఫలకం చెట్ల పొదల్లో పడి పాలకుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తోంది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్‌ఐఐసీ) ఆధ్వర్యంలో కుందనపల్లిలో ఆటోనగర్‌కు 2017లో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు, విద్యుత్తు స్తంభాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపితే ఆటోనగర్ ఏర్పాటు కల సాకారం కానుంది.

**రూ.8 కోట్లతో మౌలిక వసతులు**

పారిశ్రామిక ప్రాంతమైన ఎన్టీపీసీ వద్ద రాజీవ్ రహదారి పక్కనే ప్రస్తుతం వాహనాల మరమ్మతు దుకాణాలు నిర్వహిస్తున్నారు. మరమ్మతు కోసం



వచ్చిన భారీ వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్గాం మండలం కుందనపల్లి వద్ద ఆటోనగర్ ఏర్పాటు చేసి ఒకే చోట అన్ని రకాల వాహనాలు మరమ్మతు చేయడానికి ఏడేళ్ల కిందట 200 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో 170 మంది రెండేళ్ల కిందటే టీఎస్‌ఐఐసీతో ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన వాళ్లు ముందుకు రాలేదు. అనంతరం రూ.8 కోట్లతో 3 కి.మీ.ల మేర సీసీ రోడ్లు, వీధి దీపాలు, భగీరథ పైపులైన్లు, మురుగుకాలువలు, విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కాగా షెడ్ల నిర్మాణాలు లేకపోవడంతో సీసీ రహదారులు పగుళ్లు చూపుతున్నాయి. మురుగు కాలువల్లో ముళ్ల పొదలు కమ్ముకుంటున్నాయి.

**ప్రధాన రహదారి పక్కన ప్రమాదాలు**

బసంత్‌నగర్ నుంచి ఎన్టీపీసీ వరకు రాజీవ్ రహదారిపై నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లో రహదారులపై వాహనాల నిలిపివేతపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. మరమ్మతు కోసం వచ్చిన వాహనాలను దారిపై నిలపకుండా వెంటనే సమీపంలోని ఆటోనగర్‌కు తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. దుకాణాదారులను ఒప్పించి మెకానిక్ షెడ్లను ఆటోనగర్‌కు తరలిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ఠాకూర్‌సింగ్ చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**నిరాసక్తత ఎందుకు?**

ఆటోనగర్ కోసం కుందనపల్లి ఐవోసీ వద్ద రాజీవ్ రహదారి నుంచి దాదాపు 300 మీటర్ల దూరంలో విశాలమైన స్థలం కేటాయించారు. ప్రస్తుతం ఎన్టీపీసీ వద్ద రోడ్డు పక్కనే షెడ్లు నిర్వహిస్తున్న మెకానిక్‌లు ఆటోనగర్ వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు.

రహదారి పక్కనే, పట్టణ ప్రాంతంలో ఉంటేనే గిరాకీ ఉంటుందని భావిస్తున్నారు.ప్లాట్లు దక్కించుకున్న దుకాణదారులను సమన్వయం చేయడంలో అధికారులు విఫలమయ్యారు.

**నిర్వాహకులకు సూచిస్తున్నాం**

ఆటోనగర్‌లో మెకానిక్ షెడ్ల ఏర్పాటుకు లబ్ధిదారులను ఎంపిక చేశాం. అవసరమైన మౌలిక వసతులు కల్పించాం. నిర్మాణంపై నిర్వాహకులతో చర్చిస్తూ ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాం. కొంత మంది ముందుకొస్తున్నారు.జ్యోతి, టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్, కరీంనగర్

# సమస్యలు.. సవాళ్లు

నిజామాబాద్: చక్కెర కర్మాగారాల పునరుద్ధరణపై ప్రభుత్వ అధ్యయనం కొనసాగుతోంది. మూతపడిన పరిశ్రమను తెరిపించి నిర్వహించేందుకు ఎదురవుతున్న సమస్యలపై లోతుగా పరిశీలిస్తున్నారు. జిల్లాలో నిజాం సుగర్స్ లిమిటెడ్‌తో పాటు జగిత్యాల జిల్లా ముత్యంపేట, మెదక్ జిల్లా మంబోజిపేటలో అనుబంధ కర్మాగారాలు ఏళ్లుగా మూతపడ్డాయి. కాంగ్రెస్ ఎన్నికల హామీ అమల్లో భాగంగా పునరుద్ధరణకు అవసరమైన సిఫార్సుల కోసం జనవరిలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైంది. రెండు నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని అప్పట్లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. తొలుత చకచకా అడుగులు పడినా..తర్వాత సమస్యలు సవాళ్ల రూపంలో ఎదురయ్యాయి. వాటి పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పుకొస్తున్నారు.

**తొలుత కార్యాచరణలో వేగం**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఫిబ్రవరిలోనే సమావేశమై కర్మాగారాలు మూతపడటానికి దారితీసిన పరిస్థితులపై చర్చించింది. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ పెద్దలతో చర్చించి పాత అప్పులు బ్యాంకులకు వన్‌టైం సెటిల్మెంట్ కింద రూ.190 కోట్లు చెల్లింపులు చేసింది. యంత్రాల వినియోగ సామర్థ్యాల వివరాలు తెలుసుకోవాలని నిర్ణయించింది. పరిశ్రమలశాఖ ఆదేశాలతో ఇంజినీర్ల బృందం ఇటీవల బోధన్‌తో పాటు మిగతా రెండు యూనిట్లలో పరిశీలన చేసి ఉన్నతస్థాయికి నివేదించింది. వీటిల్లో రెండుచోట్ల వినియోగానికి అనుకూలంగా లేవని కమిటీ సభ్యుల్లో ఒకరు చెప్పారు.

**ఈ అంశాలపై తేలాకే..**కర్మాగారం తిరిగి నిర్వహించేందుకు ప్రైవేటు భాగస్వామి కలిసొచ్చే పరిస్థితులు లేవని కమిటీ సభ్యుల్లో ఇద్దరు చెప్పారు. ఆయన సెటిల్మెంట్ కోరితే ప్రభుత్వం ఏం ఆలోచన చేస్తుందో చూడాలంటున్నారు. దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. యంత్రాలు వినియోగించలేని సందర్భంలో కొత్తవి కొనాలి. ఒక్కో యూనిట్‌కు రూ.150 కోట్లు అవుతుందన్నారు. మంబోజిపేట యూనిట్‌ను ప్రైవేటుకు అప్పగించే అంశం చర్చకు వచ్చిందంటున్నారు. సహకార పద్ధతిలో నడిచే చక్కెర పరిశ్రమల ప్రోత్సాహకానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. నిధులు రావాలంటే సహకార విధానమే మేలని ఓ సభ్యుడు కమిటీ దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. అధిక దిగుబడినిచ్చే విత్తనం, కొనుగోళ్లపై బైబ్యాక్ ఒప్పందాలు స్పష్టం చేస్తే సాగుకు ముందుకొస్తారు.

**రైతుల పాత్ర కీలకం**బోధన్ యూనిట్‌లో సీజన్‌లో 5 లక్షల టన్నుల చెరకు గానుగ ఆడించేవారు. 20 వేల ఎకరాల్లో పంట సాగయ్యేది. కర్మాగారంలో మూడు షిఫ్టుల్లో ఉత్పాదన సాగేది. కానీ, నేడు వెయ్యి ఎకరాల్లోపే వేస్తున్నారు. పరిశ్రమ తెరిస్తే సాగు విస్తీర్ణం పెరగాలి. కూలీలు, రవాణా సమస్యలతో పాటు ఎకరానికి 60 టన్నుల ఉత్పత్తి వచ్చే వంగడాలు, పంట అమ్మిన 15 నుంచి 20 రోజుల్లో డబ్బులు చెల్లించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఇందుకు హామీ ఇస్తే సాగుకు రైతులు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి కర్మాగారం ప్రారంభమవుతుందని ప్రభుత్వ పెద్దలు చెబుతూ వచ్చారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఈ అంశంపై చొరవ చూపుతున్నా.. ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన అంశాలపై స్పష్టత లేదు. ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయాలు జరిగితేగాని పునరుద్ధరణ ముందుకుపడే అవకాశం ఉండదు.

# ఇదేం చోద్యం!

భగత్‌నగర్: విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ వినియోగదారుడు నష్టపోవాల్సి వచ్చింది. రెండు నెలలుగా మీటర్ పని చేయకపోవడంతో.. దానిని మార్చకపోగా.. సగటు లెక్కించి ఎక్కువ మొత్తంలో బిల్లు వేశారు. దీనికితోడు మీటర్‌కు కెపాసిటర్ బిగించుకున్నా.. సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో మూడు నెలల జరిమానా విధించారు. అక్టోబరులో అధిక మొత్తంలో బిల్లు రావడంతో ఆ వినియోగదారుడు అధికారుల వద్దకు పరుగు తీసినా.. ప్రయోజనం లేకపోయింది.

అసలేం జరిగిందంటే..కరీంనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో బి.సదయ్య అనే వ్యక్తి ఓ లాడ్జిని నిర్వహిస్తున్నారు. విద్యుత్తు సిబ్బంది మీటర్ వద్ద కెపాసిటర్ బిగించుకోవాలని గతంలో సూచించారు. అతను బిగించకపోవడంతో నెలనెలా జరిమానా విధించారు. మూడు నెలల కిందట ఆయన కెపాసిటర్ బిగించుకొని.. ఆ రశీదును విద్యుత్తు సంస్థ సెక్షన్ కార్యాలయంలో అప్పగించారు. సిబ్బంది ఆ విషయాన్ని రికార్డుల్లో నమోదు చేసి.. జరిమానా విధించొద్దు. కానీ నమోదు చేయకపోవడంతో ఆగస్టు నెలలో రూ.1837 జరిమానా విధించారు.




ఈ విషయాన్ని యజమాని గమనించలేదు. ఇలా అక్టోబరులో వచ్చిన బిల్లులో రూ.4560 జరిమానా పెండింగ్‌లో ఉన్నట్లు చూపింది. దీనికితోడు ఈనెల విద్యుత్తు బిల్లు రూ.55,313 రావడంతో కంగుతిన్న ఆయన వెంటనే అధికారుల వద్దకు వెళ్లారు. మీటర్ సరిగా పని చేయకపోవడంతో బిల్లులో స్టేటస్ 12గా చూపించిందని, సగటుగా లెక్కించి ఆ బిల్లు వచ్చిందని సెలవిచ్చారు. మీటర్ పని చేయకపోవడంతో అడ్డగోలుగా బిల్లు వేయడమేంటని.. మీటర్‌ను ఎందుకు మార్చలేదంటూ ఆయన అధికారులను నిలదీశారు. వారు ఏం చేయలేమని సమాధానమిచ్చి పంపించారు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' టౌన్-9 సెక్షన్ ఏఈ త్రిమూర్తిని వివరణ కోరగా.. పరిశీలిస్తామన్నారు.

మేల్కొండి..మీటరు కాలిపోయినా.. పని చేయకున్నా.. ఎప్పటికప్పుడు మార్చాల్సిన అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో వినియోగదారులు ఇలా నష్టపోతున్నారు. వ్యాపార వర్గాలు కెపాసిటర్ బిగించుకుంటే జరిమానా విధిస్తున్న అధికారులు.. కెపాసిటర్లను బిగించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో నెలనెలా జరిమానా చెల్లిస్తూ కొందరు నష్టపోతున్నారు. వినియోగదారులు వారికొచ్చిన బిల్లును పరిశీలించుకోవాలి. ఏదైనా తేడా ఉంటే విద్యుత్తు అధికారులను సంప్రదించాలి.

## ఇళ్లు ఇచ్చారు... వసతులు మరిచారు

సిరిసిల్ల : గూడు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు. పనుల్లో నాణ్యత లేక ఇటీవల కురిసిన వర్షాలకు గోడలకు తడి వస్తుంది. కింది బ్లాక్‌లో ఉన్న ఇళ్లలోకి వరద రావడం, రాత్రి వేళ విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కేసీఆర్ నగర్ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల కోసం 1,220 రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. మండెపల్లికి చెందిన మరో 80 మందికి ఇక్కడే నిర్మించి పంపిణీ చేశారు. ఈ కాలనీకి కేసీఆర్‌నగర్‌గా నామకరణం చేశారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రస్తుతం సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్లను ఖాళీ వెళ్లిపోయి సిరిసిల్లలో అద్దెకు ఉంటున్నారు. ఉన్న సగం మంది సమస్యలతో సతమతమవుతున్నారు.ఎవరైనా చనిపోతే కనీసం శ్మశానవాటిక లేదు.

పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారాన్ని కాలనీవాసులు రహదారికి ఇరువైపులా పడేయడంతో దుర్వాసన వస్తోంది.

ఈ కాలనీకి కేవలం మిషన్ భగీరథ నీరే ఆధారం. ఆ నీరు రాకపోతే స్థానికులు నానా పాట్లు పడాల్సి వస్తుంది.

నిర్వహణ ఎవరిది?

కేసీఆర్‌నగర్‌లో కనీస మౌలిక వసతులు కల్పించే బాధ్యతను మొన్నటి వరకు వరకు చేపట్టిన మున్సిపల్ అధికారులు రెండు నెలల క్రితం చేతులు ఎత్తేశారు. దీంతో కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వారితో మాట్లాడి తాత్కాలికంగా తంగళ్లపల్లి ఎంపీడీవో లక్ష్మీనారాయణకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో సమస్యల పరిష్కారం ప్రశ్నార్థంగా మారింది. చాలా రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళలో పాములు వస్తుండటంతో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మూడో అంతస్తుకు నీళ్లు రాకపోవడంతో కింది నుంచి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీగా ఏర్పాటు చేయాలి

మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. అధికారులు వసతులు కల్పించాలి. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి. కేసీఆర్‌కాలనీని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి.

కట్ట రవి, కేసీఆర్‌నగర్

పారిశుద్ధ్య నిర్వహణ లేదు

ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ లేదు. ఇళ్ల ముందు భాగం, మధ్యలో గడ్డి పెరిగి పాములు, తేళ్లు, విష పురుగులు వస్తున్నాయి. చీకటి వల్ల రాత్రి పూట బయటకు రాలేకపోతున్నాం. బ్లాక్‌లో మూడో అంతస్తులో ఉన్న వారు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

బల్ల కవిత, స్థానికురాలు అన్ని చర్యలు తీసుకుంటాంతంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ నీరు సరఫరాలో సమస్య ఏర్పడినప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం.

# చురుగ్గా పనులు... అందుబాటులోకి అత్యవసర చికిత్సలు



గోదావరిఖని : ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారితో పాటు అత్యంత క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న వారికి అత్యాధునిక, అత్యవసర వైద్య సేవలందించి ప్రాణాలను కాపాడేందుకు గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలో క్రిటికల్‌కేర్ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. టి.జి.ఎం.ఐ.డి.సి.(తెలంగాణ ఆరోగ్య మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో రూ.23.75 కోట్ల వ్యయంతో 50 పడకల సామర్థ్యంతో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో భవన నిర్మాణ పనులను ఆరు నెలల క్రితం చేపట్టగా ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయి. జాతీయ రహదా రుల వెంట ప్రతి 35 కిలోమీటర్ల దూరంలో ఒక ట్రామాకేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటించగా గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ భవనంలో ట్రామాకేర్‌తో పాటు వివిధ విభాగాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఇందుకోసం ఆసుపత్రి ఆవరణలోని అటెండెంట్ల షెడ్డు, కిచెన్ షెడ్డుతో పాటు నీటి ట్యాంకును కూల్చి వేశారు. పక్కనే ఉన్న నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆనుకొని నిర్మాణ పనులను చేపడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్‌కేర్ సదుపాయాల కోసం టి.జి.ఎం.ఐ.డి..సి. రూ.23.75 కోట్ల నిధులను కేటాయించగా అందులో రూ.10 కోట్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. మిగతా రూ.13.75 కోట్లతో వివిధ విభాగాల్లో అవసరమైన వైద్య సామగ్రిని సమకూర్చనున్నారు.

తగ్గనున్న దూరాభారం...

రాజీవ్ రహదారిలో నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సాధారణ గాయాలకు గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్, హైదరాబాద్‌కు తరలించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి విషమంగా మారడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. స్థానికంగానే క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తే ప్రమాదబాధితులకు దూర, ఆర్థిక భారం తగ్గడంతో పాటు ప్రాణహాని తప్పే అవకాశముంది. ఇటీవలి కాలంలో రామగుండం ప్రాంతంలో పలువురు గుండెపోటుకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆసుపత్రి ఆవరణలో గుండె వ్యాధుల శస్త్ర చికిత్స కోసం ప్రత్యేకంగా క్యాథ్‌లాబ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని కోసం ఆసుపత్రి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. స్థానిక పరిశ్రమలు సహకరిస్తే 'ఖని'లో క్యాథ్‌లాబ్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

మెరుగైన వైద్యం అందనుంది

గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణం పూర్తయితే అన్ని విభాగాల్లో అత్యవసరమైన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎంతటి క్లిష్టమైన పరిస్థితుల్లోనైనా తక్షణమే వైద్య సేవలందించే సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఆయా పనులు పూర్తయితే మెరుగైన వైద్యానికి రామగుండం కేంద్రం కానుంది. హైదరాబాద్ తరహా వైద్య సేవలు దశలవారిగా రామగుండంలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

# కొన్నారు.. మూలన పెట్టారు




జగిత్యాల : ఇక్కడ కనిపిస్తున్న 4 కొత్త ఆటోలను రూ.25 లక్షల వ్యయం చేసి బల్దియా 2 నెలల కిందట కొనుగోలు చేసింది. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ పూర్తయినా 2 నెలలుగా విద్యానగర్ నీళ్లట్యాంకు వద్దే ఉంచారు. పట్టణంలో ఓవైపు చెత్త సేకరణ లేక కాలనీలు కంపు కొడుతుంటే కొనుగోలు చేసిన వాహనాలను పక్కనపెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

స్థానిక 45వ వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా చెత్త తొలగించలేదు. దసరా పండగపూట కాలనీవాసులు దుర్గంధంతో విసిగిపోయారు. కారణమేంటని కాలనీవాసులు ఆరా తీస్తే ఈ వార్డుకు చెందిన వాహనం 2 నెలలుగా మరమ్మతులో ఉందని పురపాలక సిబ్బంది తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినా వార్డులకు కేటాయించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ఈ చిత్రంలో ముసుగుకప్పి కనిపిస్తుంది కొత్త ట్రాక్టరు. చెత్త సేకరణ కోసం రూ.14 లక్షలు వెచ్చించి బల్దియా ఏడాది కిందట దీన్ని కొనుగోలు చేసింది. షోరూం నుంచి తెచ్చి విద్యానగర్ నీళ్లట్యాంకు వద్ద చెట్టుకింద ఇలా నిలిపారు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరం నుంచి వినియోగానికి దూరమై తుప్పుపడుతోంది. జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాల సంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు.

మరమ్మతులపైనే శ్రద్ధ

పురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం.. సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15 ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి. తరచూ కమిషనర్లు మారటం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు సిబ్బంది మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..వాహనాలు పాడైపోయాయని.. కొత్త వాహనాలు లేవనే కారణాలతో పారిశుద్ధ్య సిబ్బంది వార్డుల్లో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించడం లేదు. మొరాయిస్తున్న వాహనాలతోనే సామర్థ్యానికి మించి చెత్త సేకరిస్తున్నామని కొందరు పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. వార్డుల్లో కనీసం వారం రోజులకోసారి కూడా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో పలు కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. తీవ్రమైన జ్వరాల బారిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం దోమల నివారణ మందు కూడా చల్లడం లేదు. సమస్యల పరిష్కారానికి పురపాలిక సభ్యులు స్పందించాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

# రివ్యూ ఓపీ మరింత వేగంగా

ధర్మపురి: నిత్యం వేలాది మంది వైద్య సేవలకు పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి వస్తారు. రోజుల వ్యవధిలో మళ్లీ వచ్చే వారు సైతం ఓపీ చీటీ తీసుకోవాలంటే గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రివ్యూ ఓపీకి నిరీక్షణ లేకుండా రెండే నిమిషాల్లో చీటీ అందించేలా కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. పైలెట్ ప్రాజెక్టుగా మిలీనియం బ్లాక్‌లో ఏర్పాటుచేశారు. ఓ ఐటీ సంస్థ సహకారంతో వీటిని ఏర్పాటుచేశామని, పనితీరు బాగుంటే అన్నీ విభాగాల్లో ఏర్పాటు చేస్తామని ఆస్పత్రి డైరెక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఎలా పనిచేస్తాయంటే..?ఆస్పత్రిలో 31విభాగాల్లో ఓపీ సేవలు ఉంటాయి. నిత్యం 3500మంది దాకా వస్తుంటారు. అరవై శాతం రోగులు కొద్ది రోజుల్లోనే రెండుమూడు సార్లు రావాల్సి ఉంటుంది. వచ్చిన ప్రతీసారి క్యూలో ఉండే పనిలేకుండా ఈ యంత్రంతో తీసుకోవచ్చు. మిలీనియం బ్లాక్‌లో న్యూరాలజీ, న్యూరోసర్జరీ, రుమటాలజీ, సైకియాట్రిక్ ఓపీ సేవలందిస్తారు. ఉదాహరణకు ఓ రోగి న్యూరోసర్జరీ విభాగానికి వచ్చి ఓపీ తీసుకున్నారు. వైద్యున్ని కలిస్తే కొన్ని పరీక్షలు సూచిస్తారు. రిపోర్టులు మరుసటిరోజు వస్తాయి. మరోసారి వైద్యున్ని కలవాల్సిఉంటుంది. అప్పుడు కౌంటర్ల వద్దకాకుండా కియోస్క్ వద్దకు వెళ్లి సీఆర్ నంబరు నమోదుచేస్తే వివరాలు చూపిస్తాయి. ఓపీచీటీ వస్తుంది. దాంతో వైద్యుడి వద్దకు వెళ్లవచ్చు. రూ.100వెచ్చించి తీసుకునే ఓపీకి 14 రోజుల గడువుంటుంది. గడువు ముగిసేవరకు ఎన్నిసార్లయినా ఈ యంత్రం సాయంతో తీసుకోవచ్చు.

# తనిఖీలు సరే.. రికవరీ ఏదీ!

పెద్దపల్లి : ఉన్న ఊరిలో పని కల్పించేందుకు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం అక్రమాలతో అభాసుపాలవుతోంది. పర్యవేక్షణ కరవై రూ.లక్షలు పక్కదారి పడుతున్నాయి. మండుటెండలో కష్టించిన కూలీ శ్రమ దోపిడీకి గురవుతోంది. వలసలకు అడ్డుకట్ట వేయడం మాట ఎలాగున్నా అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారులు నిధులు స్వాహా చేస్తున్నారు. తనిఖీలపై చూపుతున్న శ్రద్ధ నిధుల రికవరీపై లేకపోవడంతో అక్రమాలు పరిపాటిగా మారాయి.

అవకతవకలతో శ్రమ దోపిడీ

పనికి వెళ్లని కూలీల పేరిట నిధులు పక్కదారి పడుతున్నాయి. కొలతల నమోదులో అవకతవకలతో కూలీల శ్రమలో కోత పడుతోంది. కొంతమంది పని చేయకున్నా రికార్డు చేసి వేతనాలు చెల్లిస్తున్నారు. నేల స్వభావం గట్టిగా ఉండటంతో వేతనం గిట్టుబాటు కావడం లేదు. బోగస్ జాబ్‌కార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు. కంప్యూటరులో నమోదు చేసే క్రమంలో జరిగే తప్పులతో వేతనాల్లో హెచ్చుతగ్గులు వస్తున్నాయి.

వేటు పడుతున్నా మారని తీరు

ఉపాధిహామీలో పక్కదారి పట్టిన నిధులను రాబడం అధికారులకు



తలకు మించిన భారంగా మారింది. అవినీతి, అవకతవకలకు పాల్పడుతున్న సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నా అక్రమాలు తగ్గడం లేదు. గడిచిన తొమ్మిదేళ్లకు సంబంధించి గణాంకాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. జిల్లాలో రూ.83.64 లక్షలు పక్కదారి పట్టగా ఇప్పటివరకు రూ.76.12 లక్షలు మాత్రమే రికవరీ అయ్యాయి. నిబంధనలు కఠినంగా అమలు చేయకపోవడంతో అక్రమార్కులు తిరిగి చెల్లించేందుకు వెనుకాడుతున్నారు.

పని చేయకున్నా వేతనాలు

జిల్లాలో గత కొన్ని సామాజిక తనిఖీ నివేదికలు పరిశీలిస్తే రామగిరి మండలంలో రూ.1,01,073, కమాన్‌పూర్‌లో రూ.19,722, అంతర్గాంలో రూ.67,082, ముత్తారంలో రూ.43,703, పాలకుర్తిలో రూ.58,476, ఎలిగేడులో రూ.20,202, ధర్మారంలో రూ.1,08,941, జూలపల్లిలో రూ.10,266, కాల్వశ్రీరాంపూర్‌లో రూ.25,351, సుల్తానాబాద్‌లో రూ.33,630, పెద్దపల్లిలో రూ.59,412 చొప్పున నిధులు దుర్వినియోగమయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటలో హాజరు నమోదులో తప్పులతో కూలీలు నష్టపోయారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో పనికి చేయకున్నా కొందరు వేతనాలు పొందారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

పర్యవేక్షణ పెంచుతున్నాం

ఉపాధిహామీ పనులపై పర్యవేక్షణ పెంచుతున్నాం. కూలీల వివరాల నమోదులో పొరపాట్లను సరి చేస్తున్నాం. బోగస్ హాజరు వ్యవహారంపై పర్యవేక్షిస్తున్నాం. తనిఖీల్లో వెలుగుతు చూసిన అవకతవకలకు సంబంధించి నిధుల రికవరీకి చర్యలు తీసుకుంటున్నాం.రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# అమృత్ పథకం.. ఆమడదూరం!

జహీరాబాద్: ఇంటింటికి తాగునీటిని అందించాలని గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్మాత్మకంగా చేపట్టింది. జహీరాబాద్ పట్టణంలో ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మొత్తం పట్టణానికి నీటిని అందించాలని రూ.66 కోట్లతో రెండేళ్ల కిందట ప్రతిపాదించిన అమృత్ పథకం కార్యరూపం దాల్చలేదు.

తప్పని ఎదురు చూపులు: జహీరాబాద్ పురపాలికలో 1.20 లక్షల జనాభా, 37వార్డులు, 14వేలకు పైగా గృహాలున్నాయి. రోజుకు 1.60 కోట్ల లీటర్ల నీరు అవసరం ఉండగా, ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా 80 లక్షల లీటర్లు, బోర్ల ద్వారా మరో 20 లక్షల లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో నాలుగేళ్ల కిందట మిషన్ భగీరథ పథకం చేపట్టినా, ఇంకా 20శాతం వార్డుల్లో పైపులు వేయలేదు. మరో 20శాతం ప్రాంతాల్లో పైపులైను వేసినా నీటిని సరఫరా చేయడంలేదు. అమృత్ పథకం ద్వారా మరో 70 లక్షల లీటర్ల నీటిని అందించి, భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా చేయాలని ప్రతిపాదించినా,



ప్రారంభానికి నోచలేదు.

పునరుద్ధరణకు నోచని పథకం: పట్టణానికి 20ఏళ్లుగా రాయికోడ్ మండలం ఇటికేపల్లి శివారు మంజీరా నది నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. దాదాపు 44కిలోమీటర్ల దూరం ఉండడంతో బోర్లు తరుచుగా కాలిపోవడం, పైపులైన్లు పగిలిపోయి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఐదేళ్ల కిందట రెండేళ్ల పాటు ఏర్పడిన వర్షాభావంతో నది పూర్తిగా ఎండిపోవడంతో పథకాన్ని పూర్తిగా నిలిపివేశారు. అంతలోనే మిషన్ భగీరథ రావడంతో నిరుపయోగంగా మారింది. అమృత్ పథకం నిధుల ద్వారా పునరుద్ధరించాలని నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు.అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం..ఈ పథకంపై పూర్తి అవగాహన లేదు. త్వరలోనే మిషన్‌భగీరథ, ప్రజారోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పరిస్థితిని తెలుసుకుని ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు వేగంగా సాగేలా చూస్తాం.శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ పురపాలక సంఘం.



# అమరావతి అభివృద్ధికి రూ.కోటి విరాళం అందించిన మహిళ

అమరావతి: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఇందుపల్లికి చెందిన కోగంటి ఇందిరాదేవి కుమార్తె పి.విజయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.కోటి విరాళం అందజేశారు.

సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ మేరకు చెక్కును ఇచ్చారు. ప్రస్తుతం హైదారాబాద్ ఫిల్మ్‌నగర్‌లో నివాసం ఉంటున్న విజయలక్ష్మి.. అమరావతి నిర్మాణంలో తాము సైతం భాగస్వాములం కావాలనే ఉద్దేశంతో రూ.కోటి విరాళంగా ఇచ్చామని తెలిపారు. తమ తల్లి ఇందిరాదేవి పేరిట, ఆమె కోరిక నెరవేర్చేందుకు హైదరాబాద్‌లో తమకున్న స్థలాన్ని అమ్మి విరాళం ఇస్తున్నట్లు పి. విజయలక్ష్మి చెప్పారు. ఆమె త్యాగనిరతి, స్ఫూర్తిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

స్థలం అమ్మి తల్లి పేరిట రాజధాని నిర్మాణం కోసం ఇచ్చిన విరాళం చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. కోగంటి ఇందిరాదేవి గతంలో సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్‌గా ఉన్నారు.

# ఆ షిప్‌లోకి బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో తేలుస్తాం: కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్



కాకినాడ: అక్రమంగా తరలించిన బియ్యం స్టెల్లా షిప్‌లోకి ఎక్కడి నుంచి వచ్చాయో తేలుస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ చెప్పారు. ఎగుమతిదారు ఎవరు? ఏ గోదాములో బియ్యం ఉన్నాయో పరిశీలిస్తామన్నారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. "గోదాము నుంచి కాకినాడ పోర్టులోని షిప్ వరకు పేదల బియ్యం ఎలా వచ్చాయో విచారణ చేపడతాం.

అందులో ఉన్న మొత్తం పేదల బియ్యమేనా?అనేది కూడా పరిశీలిస్తాం. ఈ వ్యవహారంపై ఐదుగురు సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం. దీనిలో రెవెన్యూ, పోలీసు, కస్టమ్స్, పౌరసరఫరాల శాఖ, పోర్టు అథారిటీ అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రతి లోడ్‌ను పరిశీలించి బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో విచారిస్తాం. సభ్యుల బృందం తనిఖీలకు విధివిధానాలు రూపొందిస్తున్నాం. బ్యాంకు గ్యారంటీతో విడుదల చేసిన బియ్యం షిప్‌లో ఉందో లేదో నిర్ధరిస్తాం. ఏ సమాచారం కోసమైనా 7993332244 నంబర్‌ను సంప్రదించవచ్చు" అని జిల్లా కలెక్టర్ వివరించారు.

# జగన్.. వాస్తవ లెక్కలు చూస్తే మీ నిర్వాకం తెలుస్తోంది: మంత్రి నాదెండ్ల



అమరావతి: గత జగన్ పాలనలో ఈ సమయానికి సేకరించిన ధాన్యం 4.43 మెట్రిక్ టన్నులని.. బాధ్యతతో కూటమి ప్రభుత్వం సేకరించిన ధాన్యం 9.14 మెట్రిక్ టన్నులని మంత్రి నాదెండ్ల మనోహన్ అన్నారు. వాస్తవ లెక్కలు చూస్తే జగన్ నిర్వాకం తెలుస్తోందని విమర్శించారు. సేకరించిన 24 గంటల్లో రైతు ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నామన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ఈ మేరకు జిల్లాల వారీగా వివరాలను మంత్రి నాదెండ్ల 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త చెప్పిన ఆర్టీసీ ఛైర్మన్..



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1,600 నూతన బస్సులు కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ తెలిపారు. వీటిలో ఇప్పటికే 900 బస్సులు అందుబాటులోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా విజయవాడ బస్ డిపోలో నూతన బస్ సర్వీసులను కొనకళ్ల ప్రారంభించారు. కొత్తగా కొనుగోలు చేస్తున్న 1,600 బస్సులను రాష్ట్రవ్యాప్తంగా నడపనున్నట్లు ఆర్టీసీ ఛైర్మన్ తెలిపారు.

**లాభాల బాట పట్టిస్తాం..** ఆర్టీసీని తిరిగి లాభాల బాటలోకి తీసుకువెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కొనకళ్ల చెప్పారు. ఇందుకు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్లు, అధికారులతో కలిసి కార్యాచరణ రూపొందించినట్లు కొనకళ్ల వెల్లడించారు. ముందుగా దెబ్బతిన్న బస్టాండ్లలో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన చెప్పారు. ఏపీలో ఎలక్ట్రికల్ బస్సులను పెద్దస్థాయిలో నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు.

**అప్పుడే ఉచిత ప్రయాణం..** మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్నట్లు ఆర్టీసీ ఛైర్మన్ తెలిపారు. త్వరలోనే మహిళలకు శుభవార్త చెబుతామని ఆయన చెప్పారు. మరికొన్ని రోజుల్లో ఉచిత బస్సు పథకంపై విధివిధానాలు ప్రకటించి, పథకం అమలు చేస్తామని శుభవార్త చెప్పారు కొనకళ్ల. ప్రైవేటు బస్సులకు దీటుగా ప్రజలకు ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలు అందిస్తామని ఆయన వెల్లడించారు.

**సమస్యలు పరిష్కరిస్తాం..** ఆర్టీసీ కార్మికులకు సైతం న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వారి సమస్యలను పరిశీలించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని కొనకళ్ల మండిపడ్డారు. ప్రస్తుతం సమస్యలన్నిటినీ పరిష్కరించి, ఆర్టీసీని లాభాల బాట పట్టించడమే తమ ప్రధాన ధ్యేయమని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ చెప్పారు.

# డాక్టర్ ప్రభావతి ముందస్తు బెయిల్.. ఇంప్లీడ్ పిటిషన్ వేసిన రఘురామ



అమరావతి, డిసెంబర్ 3: ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో అప్పటి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి వేసిన ముందస్తు బెయిల్‌పై ఈరోజు (మంగళవారం) జిల్లా కోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసులో తమను ఇంప్లీడ్ చేయాలని రఘురామ కృష్ణ రాజు పిటిషన్ వేశారు. రఘురామ తరపున హైకోర్ట్ న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ పిటిషన్ వేశారు. రఘురామపై థర్డ్ డిగ్రీ ప్రయోగంలో ప్రభావతి కూడా హత్యాయత్నంలో భాగస్వాములు అయ్యారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. రఘురామ కృష్ణం రాజును పరీక్షించిన వైద్య బృందం ఆయన కాలుపై బలమైన దెబ్బలు ఉన్నాయని నివేదిక ఇచ్చారని న్యాయవాది తెలిపారు. ఆయన రెండు కాళ్ళకు బలమైన దెబ్బలతో పాటు వాచి ఉన్నాయని పిటిషనర్ వెల్లడించారు. వైద్య బృందం ఇచ్చిన నివేదికను టాంపరింగ్ చేశారని, అందుకు భిన్నంగా నివేదిక ఇవ్వడం లో ప్రభావతి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. బైపాస్ సర్జరీ చేయించకున్న అని చెప్పినప్పటికీ గుండెలపై కూర్చొని బాధారని చెప్పినప్పటికీ ప్రభావతి ఈ అంశాన్ని తొక్కి పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువలనే ఆమెకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని పేర్కొంటూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించాలని న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ కోరారు.

**రఘురామ ఇచ్చిన ఫిర్యాదుతో..** కాగా.. 2021 మే నెలలో సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకుని చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలైలో రఘురామ రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై గుంటూరు నగరంపాలెం స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ ఆంజనేయులు, సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్, అప్పటి సీఎం జగన్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రభావతి, మరి కొంతమందిని నిందితులుగా చేర్చారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం ప్రకాశం జిల్లా ఎస్పీని విచారణాధికారిగా నియమించింది. ఈ క్రమంలో రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను ఇటీవల ఒంగోలోని ఎస్పీ కార్యాలయానికి పిలిపించి విచారణ జరిపారు. పోలీసులు అడిగిన అనేక ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేదు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విచారణ జరిపిన పోలీసులు.. ఈ కేసుకు సంబందించి అనేక ప్రశ్నలు ఆయన ముందు ఉంచారు. అయితే దేనికి కూడా విజయ్ పాల్ సరైన సమాధానం ఇవ్వ లేదు. విచారణ అనంతరం ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టగా.. ఆయనకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో విజయ్ పాల్‌ను కోర్టు నుంచి గుంటూరు జిల్లా జైలుకు పోలీసులు తరలించారు. అయితే అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు విజయ్‌పాల్ అనేక ప్రయత్నాలు చేశారు. హైకోర్టులో ఆయనకు చుక్కెదురు కావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ కోసం విజయ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన శ్రీకాంతాచారి ప్రాణత్యాగం: కేటీఆర్ శ్రీకాంతాచారి అమరత్వం గొప్పదని, ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ అరెస్టును చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యారని చెప్పారు.




# బాబోయ్.. ఏపీకి పొంచి ఉన్న మరో ముప్పు..

అమరావతి : ఏపీని ఓ వైపు ఫెంగల్ తుపాను భయపడుతుండగా.. మరో బాంబు పేల్చారు వాతావరణ శాఖ అధికారులు. ఏపీకి ఫెంగల్ ముప్పు తక్కువే అయినా.. మరో ముప్పు పొంచి ఉందని ప్రకటించారు. డిసెంబర్ రెండో వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతోందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. ఈ అల్పపీడనం వాయుగుండంగా మారి తుపానుగా పరిణమించే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావం ఏపీపై అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు.

**హడలెత్తిస్తున్న ఫెంగల్..** ఫెంగల్ తుపాను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను వణికిస్తోంది. ఈ తుపాను ప్రభావంతో తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం నాడు కూడా దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడుతాయని అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఫెంగల్ తుపాను బలహీనపడుతోందని.. క్రమంగా అరేబియా సముద్రం వైపు కదులుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే, ఫెంగల్ తుపాను ఏపీపై పెద్దగా ప్రభావం చూపకపోయినా.. మరో ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

**పొంచి ఉన్న మరో ముప్పు..** ఓవైపు ఫెంగల్ తుపాను ప్రభావం కొనసాగుతుండగానే.. మరో ముప్పు ముంచుకొస్తోంది.

నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. డిసెంబర్ రెండో వారంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడనుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

దీని ప్రభావం ఏపీలోని దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. తీర ప్రాంత జిల్లాలో భారీ వర్షం కురిసే ఛాన్స్ ఉందంటున్నారు.

# వికలాంగులు, సామాన్య ప్రజలు ఒక్కటే



హైదరాబాద్/అమరావతి, డిసెంబర్ 3: ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిల్స్‌ను భువనేశ్వరి పంపిణీ చేశారు. అనంతరం భువనమ్మ మాట్లాడుతూ.. ప్రపంచంలో 100 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారని.. అందులో రెండున్నర కోట్ల మంది భారతదేశంలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఇవి గుర్తించి వికలాంగుల కోటా, పెన్షన్‌లు వంటివి ఇస్తున్నాయన్నారు. చాలామంది దివ్యాంగులు.. సహాయంతో తమను తాము నమ్ముకుని గొప్పస్థాయికి వెళ్లారని తెలిపారు.

అలాగే ఏం తీసుకోకుండా పట్టుదలతో, నిరూపించుకోవాలని కూడా ముందుకు వెళ్తున్నారని చెప్పారు. కొంతమంది పుట్టుకతో మరికొందరు కొంతమంది ప్రమాదాల వల్ల దివ్యాంగులు అవుతారన్నారు. వికలాంగులు, సామాన్య ప్రజలు ఒక్కటే అని తెలిపారు. అందరూ అందరిని ఆదరించుకోవాలని.. ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌ను చంద్రబాబు.. నందమూరి తారకరామారావు పేరుతో ప్రారంభించారని తెలిపారు.

మనవసేవే మాధవ సేవ అని ఎన్టీఆర్ నమ్మారని.. దాన్నే ట్రస్ట్ ఆచరిస్తుందని తెలిపారు. ప్రజలకు ఏది అవసరమో అది అందించడంలో ముందు ఉంటామని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు.

**సీఎం చంద్రబాబు, లోకేష్ శుభాకాంక్షలు...** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. దివ్యాంగులకు మొదలటి నుంచి టీడీపీ అండగా ఉంటోందని సీఎం చంద్రబాబు అన్నారు. "ఆత్మవిశ్వాసాన్ని అణువణువునా నింపుకుని అందరితో సమానంగా ముందడుగేస్తోన్న దివ్యాంగులకు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు. ప్రోత్సహిస్తే దివ్యాంగులు ఏదైనా సాధించగలరని మేం బలంగా నమ్ముతాం. అందుకే దివ్యాంగులకు మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటోంది. దివ్యాంగుల కోసం మూడు చక్రాల మోటారు వాహనాలు, స్వయం ఉపాధి పొందేందుకు రూ.1 లక్ష సబ్సిడీతో రుణాలు అందించి వారికి అండగా నిలిచాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్ ను రూ. 3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచి ఇస్తున్నాం. దేశంలో దివ్యాంగులకు రూ.6 వేలు పింఛను ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే అని చెప్పడానికి నేను చాలా సంతోష పడుతున్నాను. అవరోధాలను, సవాళ్లను అధిగమించి....మీరు జీవితంలో విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అంటూ ఎక్స్‌లో చంద్రబాబు పోస్టు చేశారు.

# సౌదీలో చిక్కుకున్న వారిని స్వదేశానికి రప్పిస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి: సౌదీ అరేబియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువతను స్వదేశానికి రప్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలోని పలాస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు చెందిన 16 మంది యువకులు అక్కడ చిక్కుకున్నారు. ఏజెంట్ల ద్వారా మోసపోయిన యువకులను తిరిగి సొంత ప్రాంతాలకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో ఈ అంశంపై చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని చెప్పారు. కూటమి ప్రభు త్వంలో ఉత్తరాంధ్రలో పరిశ్రమల అభివృద్ధి, యువతలో నైపుణ్య శిక్షణ పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామన్నారు.

# చిన్మయ్ కృష్ణదాస్ కేసు.. వాదించేందుకు ముందుకురాని లాయర్లు



ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే కోర్టులో ఆయన బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు లాయర్లు ఎవరూ ముందుకురావట్లేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. కృష్ణదాస్ కేసును వాదించేందుకు ముందుకువచ్చిన ఓ న్యాయవాదిపై ఆందోళనకారులు తీవ్రంగా దాడి చేయడంతో ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఇస్కాన్ కోల్‌కతా ప్రతినిధి రాధారామన్ దాస్ పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా న్యాయవాది ఇంటిపైనా దాడి చేశారన్నారు. రవీంద్ర ఘోష్ అనే మరో న్యాయవాది కేసును వాదించేందుకు దాదాపు 250 కిలోమీటర్లు ప్రయాణించి ఢాకా నుంచి వస్తే.. స్థానికులు అతడిని కోర్టు ప్రాంగణంలోకి అనుమతించలేదని ఆరోపించారు. దీంతో చిన్మయ్ కృష్ణదాస్ తరఫున కేసును వాదించేందుకు లాయర్లు భయపడుతున్నారని తెలిపారు. దీంతో బెయిల్ విచారణను బంగ్లాదేశ్ కోర్టు వచ్చే నెలకు వాయిదా వేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గత నెలలో అక్కడ జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈక్రమంలో బంగ్లాదేశ్ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో చెలరేగిన ఘర్షణల్లో ఓ న్యాయవాది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం (ఇస్కాన్) కార్యకలాపాలపై నిషేధం విధించాలని ఓ న్యాయవాది పిటిషన్ వేయగా.. బంగ్లా హైకోర్టు దానిని కొట్టివేసింది.

# స్వర్ణ దేవాలయంలో శిక్ష అనుభవించిన సుఖ్‌బీర్ సింగ్..!



పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ నేత సుఖబీర్ సింగ్ బాదల్‌కు అకాల్ తఖ్త్ పలు శిక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో సేవాదార్(కాపలాదారుడు)గా శిక్షను అనుభవించారు. మంగళవారం ఉదయం వీల్‌చైర్‌లో స్వర్ణ దేవాలయానికి వచ్చిన ఆయన ప్రవేశద్వారం వద్ద మెడలో పలకను ధరించి, చేతిలో ఈటెను పట్టుకొని సేవాదర్ శిక్షను అనుభవించారు. మరోవైపు పార్టీ సీనియర్ నాయకులు బిక్రమ్ సింగ్ మజీతియా సైతం శిక్షను అనుభవించారు. పార్టీ నాయకులతో కలిసి స్వర్ణదేవాలయంలో పాత్రలు శుభ్రం చేయడంతో పాటు బాత్‌రూమ్‌లను సైతం శుభ్రం చేశారు. శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సుఖబీర్ సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. 2007-17 మధ్య కాలంలో పార్టీతోపాటు వారి ప్రభుత్వం రాజకీయంగా పలు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు అకాల్ తఖ్త్ నిర్ధరించింది. ఈ విషయంలో పార్టీ చీఫ్ సుఖ్‌బీర్‌ను దోషిగా తేల్చారు. తాను చేసిన తప్పులను అంగీకరించిన సుఖ్‌బీర్ బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ క్రమంలోనే ఆయనకు స్వర్ణ దేవాలయంలో పాత్రలు, బూట్లు శుభ్రం చేయాలని అకల్ తఖ్త్ ఆదేశించింది. అంతేకాకుండా ఆయన తండ్రి పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్‌కు గతంలో ఇచ్చిన బిరుదును కూడా ఉప సంహరించుకుంటున్నట్లు తెలిపింది.

# మెహ్రీన్ అందాల మాయాజాలం

నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమ గాధ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్. ఈ అమ్మడిని కెరీర్ ఆరంభంలో జూనియర్ మిల్కీ బ్యూటీ అంటూ పిలిచే వారు. మిల్కీ బ్యూటీ తమన్నా మాదిరిగా స్కిన్ టోన్ అదిరి పోయిందని, మెహ్రీన్ కి సైతం మంచి ఫ్యూచర్ ఉందని కెరీర్ ఆరంభంలో చాలా మంది చాలా రకాలుగా అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ ఈ అమ్మడికి టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో భారీ విజయాలు సొంతం కాలేదు. చేసిన కొన్ని సినిమాల్లో ఎక్కువ శాతం ఫ్లాప్‌లు ఉన్నాయి. ఎఫ్ 2 వంటి సినిమాల్లో మంచి పాత్రలు దక్కించుకున్నా ఆ తర్వాత ఎక్కువ ఆఫర్లు దక్కించుకోవడంలో మెహ్రీన్ ఫెయిల్ అయ్యింది. కెరీర్‌లో కొన్ని తప్పుడు నిర్ణయాల వల్ల ఆఫర్లు తగ్గాయి అంటూ ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ఈ అమ్మడు చెప్పుకొచ్చింది. ఆ నిర్ణయాలు ఏంటి అనే విషయం పక్కన పెడితే సోషల్ మీడియాలో ఈమె ఇంకా అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంది. తన అభిమానులతో పాటు నెటిజన్స్ ని మాయ చేస్తూ అందంతో



మత్తు చల్లినట్లుగా కవ్విస్తోంది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం మెహ్రీన్‌కే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్ 2 సినిమాలతో సక్సెస్‌లు దక్కించున్న మెహ్రీన్ ఎఫ్ 3 తర్వాత పెద్దగా కనిపించడం లేదు. సినిమాల్లో ఎక్కువగా కనిపించకున్నా సోషల్ మీడియాలో మాత్రం మెహ్రీన్ రెగ్యులర్‌గా కనిపిస్తూనే ఉంది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చేసే అందాల ఆరబోత ఫోటోల కారణంగా రెగ్యులర్‌గా వార్తల్లో ఉంటుంది. కనుక ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారితో పాటు ప్రేక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మెహ్రీన్ అందానికి మరో అయిదు ఆరు ఏళ్లు పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. మెహ్రీన్ ఒక సాధారణ సిక్కు ఫ్యామిలీలో జన్మించింది. చిన్న వయసులోనే కెనడాలోని టొరంటోలో మిస్ పర్సనాలిటీ సౌత్ ఆసియా కెనడా 2013 కిరీటాన్ని సొంతం చేసుకుంది. సుదీర్ఘ కాలం పాటు మోడలింగ్‌లో రాణించిన మెహ్రీన్ కి సినిమాల్లో ఆఫర్లు వచ్చినా మోడలింగ్ కంటిన్యూ చేసింది. ఆ మోడలింగ్ అనుభవంతో ఎన్నో కమర్షియల్ యాడ్స్ లో ఇప్పటికీ నటిస్తూనే ఉంది. ముందు ముందు టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ బిజీ హీరోయిన్‌గా మారాలని ఆశ పడుతున్నట్లుగా ఆమె సన్నిహితులు చెబుతున్నారు. మరి మళ్లీ మెహ్రీన్‌కి ఆఫర్లు దక్కేనా చూడాలి.

# త్రిష.. రెమ్యునరేషన్ ఎక్కువే.. సినిమాలు ఎక్కువే..

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ గా రెండు దశాబ్దాల పాటు తిరుగులేని ఇమేజ్ తో దూసుకుపోయిన అందాల భామ. మొదట 1999లో ప్రశాంత్ సిమ్రాన్ జంటగా వచ్చిన 'జోడీ' చిత్రంలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్ లో నటించింది. హీరోయిన్ అవ్వడానికి మూడేళ్ళ సమయం తీసుకున్న తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. 2003లో 'నీ మనసు నాకు తెలుసు' సినిమాతో త్రిష టాలీవుడ్ లోకి కూడా అడుగుపెట్టింది. అక్కడి నుంచి ఓ వైపు యంగ్ హీరోలు మరో వైపు స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ టాప్ స్టార్ గా ఎదిగింది. రెండు దశాబ్దాల పాటు ఆమె స్టార్ హీరోయిన్ గానే తన ఇమేజ్ ని కొనసాగించింది. ప్రస్తుతం 41 ఏళ్ళ వయస్సులో ఉన్న త్రిష ఇప్పటికి తన ఛరిష్మాని కొనసాగిస్తోంది. నిజానికి 'పొన్నియన్ సెల్వన్' కి ముందు ఆమె కెరియర్ డ్రాప్ అయ్యింది. అయితే ఆ మూవీ ఇచ్చిన క్రేజ్ తో



అవకాశాలు క్యూ కట్టాయి. 'లియో' మూవీలో విజయ్ కి జోడీగా నటించి సక్సెస్ అందుకుంది. ఇదిలా ఉంటే అజిత్ తో నటించిన 'విదాముయార్చి' మూవీ సంక్రాంతికి రిలీజ్ కాబోతోంది. అలాగే అజిత్ తో చేస్తోన్న మరో మూవీ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా రిలీజ్ కి సిద్ధం అవుతోంది. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో 'విశ్వంభర' మూవీ కంప్లీట్ చేసింది. మలయాళంలో 'ఐడెంటిటీ' అనే మరో సినిమా కూడా పూర్తి చేసింది వీటితో పాటు కమల్ హాసన్ 'థగ్ లైఫ్', మలయాళంలో మోహన్ లాల్ 'రామ్' సినిమాలలో త్రిష హీరోయిన్ గా నటించింది. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో సూర్య హీరోగా స్టార్ట్ అయిన 'సూర్య 45' మూవీలో కూడా త్రిష హీరోయిన్ గా కన్ఫర్మ్ అయ్యింది. ఇలా ఆమె చేతిలో ఏకంగా ఏడు సినిమాలు ఉన్నాయి. వాటిలో చాలా వరకు భారీ బడ్జెట్ చిత్రాలే కావడం విశేషం. ఇదిలా ఉంటే ప్రస్తుతం త్రిష రెమ్యునరేషన్ కూడా కోటి రూపాయిల వరకు తీసుకుంటుందని తెలుస్తోంది. స్టార్ హీరోలకి ఫస్ట్ ఛాయస్ గా త్రిషనే ఇప్పుడు కనిపిస్తోంది ఈ ఏడు సినిమాలలో సరైన సక్సెస్ లు పడితే మరి కొంతకాలం ఆమె స్పీడ్ ని ఎవరు ఆపలేరని ట్రేడ్ పండితులు అంటున్నారు. త్రిషతోనే హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసిన చాలా మంది బ్యూటీస్ ఇప్పుడు సైడ్ క్యారెక్టర్స్ చేసుకుంటున్నారు. అయితే 41 ఏళ్ళ వయస్సులో కూడా త్రిష స్టార్ హీరోలతో మూవీస్ చేస్తూ భారీ రెమ్యునరేషన్ తీసుకుంటూ ఉండటం విశేషం.




# పుష్ప-2 ఓవర్సీస్.. నెవ్వర్ బిఫోర్ అనేలా..



పుష్ప.. పుష్ప.. పుష్ప.. ప్రస్తుతం ఎక్కడ చూసినా పుష్ప మ్యానియా కనిపిస్తోంది. మరో మూడు రోజుల్లో రిలీజ్ కానున్న పుష్ప 2: ది రూల్ తో మేజిక్ చేసేందుకు మళ్లీ సిద్ధమయ్యారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్. పుష్ప-2.. ఈ సారి వైల్డ్ ఫైర్.. అసలు తగ్గేదేలే అంటూ థియేటర్లలో డిసెంబర్ 5వ తేదీన సందడి చేయనున్నారు. అయితే పుష్ప-2 సినిమాను వరల్డ్ వైడ్ గా 12 వేల స్క్రీన్స్ లో మేకర్స్ రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఓవర్సీస్ లో 5 వేలకు పైగా స్క్రీన్లలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ బాధ్యతలను ప్రముఖ ప్రత్యంగిరా సినిమాస్, %ూూా% సినిమాస్ సంయుక్తంగా చేపడుతున్నాయి. ఇప్పటికే అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాయని సమాచారం. ప్రస్తుతం వరల్డ్ వైడ్ గా పుష్ప-2 అడ్వాన్స్ బుకింగ్ జోరుగా సాగుతున్నాయి. అయితే విదేశాల్లో పుష్ప సీక్వెల్ ప్రీ సేల్ బుకింగ్స్ చాలా రోజుల క్రితమే ప్రారంభమయ్యాయి. ఓపెన్ చేయగానే హాట్ కేకుల్లా టికెట్లు అమ్ముడుపోయాయి. దీంతో ఓవర్సీస్ లో అత్యంత వేగంగా 50 వేల టికెట్స్ సేల్ అయిన చిత్రంగా పుష్ప 2 ఇప్పటికే సరికొత్త రికార్డు నెలకొల్పింది. అదే సమయంలో ఓషియానియాలో 700 డాలర్లు కలెక్ట్ చేసి ఇప్పటి వరకు ఏ ఇండియన్ మూవీ అందుకోని రికార్డును తాజాగా దక్కించుకుంది. ఇప్పటికీ అనేక దేశాల్లో జోరుగా ప్రే సేల్స్ జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ప్రీమియర్లతో పాటు ఫస్ట్ డే కోసం ప్రీ సేల్స్ ద్వారా 3.383 మిలియన్ల డాలర్లను రాబట్టింది పుష్ప-2. దీంతో అది పెద్ద రికార్డనే చెప్పాలి! ప్రీ సేల్స్ (ప్రీమియర్స్ ం ఫస్ట్ డే) లో నార్త్ అమెరికాలో 2.35 మిలియన్ డాలర్లు వసూలు చేయగా.. రిలీజ్ నాటికి నాలుగు మిలియన్ల డాలర్లు రాబట్టే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. గల్ఫ్ లో 140 కోట్ల డాలర్లు రాబట్టిన పుష్ప-2.. యూకే, ఐర్లాండ్ దేశాలు కలిపి 262 కోట్ల డాలర్లు వసూలు చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది! ఆస్ట్రేలియాలో 210 కోట్ల డాలర్లు, న్యూజిలాండ్ లో 21 కోట్ల డాలర్లను ప్రీ సేల్స్ ద్వారా కలెక్ట్ చేసింది పుష్ప 2. మిగతా అన్ని దేశాలు కలిపి 300 కోట్ల డాలర్లకు పైగా రాబట్టింది. ఇంకా రిలీజ్ కు టైమ్ దగ్గరపడుతున్న కొద్దీ మరిన్ని వసూళ్లను సాధించనుంది.

అయితే ఇవి ప్రీమియర్స్, ఫస్ట్ డే లెక్కలు మాత్రమే. మొత్తంగా చూసుకుంటే మరిన్ని వసూళ్లు ఉంటాయి. దీంతో పుష్ప-2.. ఓవర్సీస్ లో నెవ్వర్ బిఫోర్ అనేలా రికార్డులు సాధించడం పక్కా.

# సితార ఘట్టమనేని పాప్‌స్టార్ వైబ్స్



సితార ఘట్టమనేని పరిచయం అవసరం లేదు. సూపర్ స్టార్ మహేష్- నమ్రత దంపతుల ఏకైక గారాలపట్టీ. 12 వయసుకే చాలా గుర్తింపు తెచ్చుకుంది సితార. ప్రస్తుతం హైదరాబాద్‌లోని CHIREC ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతోంది. బాల నటిగా.. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గా.. కూచిపూడి .. బ్యాలెట్ డ్యాన్సర్‌గా సితార శిక్షణ పొందింది. నటన- మోడలింగ్‌పైనా ఆసక్తిని కనబరుస్తోంది. ఇంతకుముందు ఓ వాణిజ్య ప్రకటనలో నటించగా కోటి ఆర్జించిన సితార, ఆ మొత్తాన్ని చారిటీకి అందించి తన గొప్ప మనసును చాటుకుంది. సితార కూడా గ్లామర్ రంగంలో తన తల్లిదండ్రుల అడుగుజాడలను అనుసరించవచ్చని ఊహాగానాలు ఉన్నాయి. చదవడం, పెయింటింగ్ చేయడం, గిటార్ వాయించడం, ఈత కొట్టడం తనకు ఎంతో ఇష్టమైన వ్యాపకాలు. తన కుటుంబం సినీరంగంలో ఉంది గనుక.. వారసత్వాన్ని కొనసాగించాలని ఆలోచిస్తున్నానని, అయితే ఇంకా కచ్చితంగా దీని గురించి తెలియదని సితార గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. అయితే సితార తన తల్లిగారైన నమ్రతతో కలిసి పబ్లిక్ అప్పియరెన్సులు ఇవ్వడం ఆసక్తిని కలిగిస్తోంది. తాజాగా గ్రామీ విన్నింగ్ సింగర్ ముంబైలో గత రాత్రి (నవంబర్ 30) MMRDA గ్రౌండ్స్‌లో తన తొలి సంగీత కచేరీ ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. ఈ కచేరీకి హాజరైన వారిలో మహేష్ బాబు భార్య నమ్రతా శిరోద్కర్, కుమార్తె సితార ఘట్టమనేని ఉన్నారు. నమ్రత - సితార ఇద్దరూ దువా లిపాతో కలిసి దిగిన ఫోటోలను సోషల్ మీడియాల్లో షేర్ చేసారు. కచేరీని ఆస్వాధించిన తర్వాత వీరందరికీ పాప్ ఐకన్ ద్యుయా లిపాను కలిసే అవకాశం లభించింది. ముఖ్యంగా సితార పాప్ స్టార్ ద్యుయాలిపాతో ఫ్యాన్ గర్ల్ మూమెంట్‌ను ఆస్వాధించింది. అందుకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి. నమ్రతా శిరోద్కర్ తన ఇన్‌స్టాలో ఈ పోటోలను షేర్ చేసారు. సితార దుయా లిపాతో పోజులిచ్చిన ఫోటోలను షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. ఆఫ్ షోల్డర్ షిమ్మరీ డ్రెస్ లో సితార ఎంతో అందంగా కనిపించగా, నమ్రత నేవీ బ్లూ జాకెట్‌తో బ్లాక్ కో ఆర్డ్ సెట్‌ను ధరించింది. ఈ ఫోటోలను షేర్ చేసిన నమ్రత ఏ%ంబుశ్రీఅజూఖ% జస్ట్ స్టన్నింగ్ అని రాశారు. మరోవైపు సితార దువా లిపాతో వరుసగా సెల్ఫీలు దిగింది. పాప్ సింగర్ ద్యువా లిపా సితార సహా తన స్నేహితులతో ఆనందంగా పోజులిచ్చింది. ఇక అంతర్జాతీయ పాప్ స్టార్ తో సితారను చూడగానే అభిమానులు సీతాపాప పాప్ స్టార్! అంటూ కితాబిచ్చేస్తున్నారు. అలాగే రెడ్ హార్ట్ ఈమోజీలతో సీతాపాపపై తమ ప్రేమను కురిపించారు. భారతదేశం నుంచి సితార ఘట్టమనేని కూడా పెద్ద పాప్ స్టార్ కాగలదు! అని అందరూ ప్రోత్సహిస్తున్నారు. సితార ఛరిష్మాటిక్ లుక్స్ ని బట్టి తనకు ఆ అర్హత ఉందని కూడా విశ్లేషిస్తున్నారు. ఈ శనివారం రాత్రి ద్యుయా లిపా ముంబై సంగీత కచేరీ నుండి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆమె తన హిట్ పాటల ప్రదర్శనలతో అభిమానులకు స్పెషల్ ట్రీటిచ్చింది. లెవిటేటింగ్ వర్సెస్ వో లడ్కీ జో (షారూఖ్ ఖాన్ -బాద్షా పాట) మాష్-అప్ లోను నర్తించింది. అది అభిమానులను ఉర్రూతలూగించింది. ఈ వీడియో షారుఖ్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ దృష్టిని కూడా ఆకర్షించింది. సితార-నమ్రతతో పాటు నటుడు రణవీర్ షోరే, అతని కుమారుడు హరూన్, నేహా శర్మ, ఐషా శర్మ తదితరులు కచేరీలో పాల్గొన్నారు.

# అబ్బా అనిపించే హెబ్బా క్లోజప్ క్లిక్స్

కన్నడ చిత్రం 'అద్యక్ష' తో నటనా రంగంలో అడుగు పెట్టిన హెబ్బా పటేల్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో ఈమె నటించిన 'కుమారి 21ఎఫ్' సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈతరం అమ్మాయిలకు రూపంగా హెబ్బా పటేల్ ఆ సినిమాలో కనిపించిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా తెలుగులో మొదటి సినిమానే అయినా భలే నటించింది అంటూ విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అలాంటి మోడ్రన్ పాత్రల్లో నటించేందుకు అమ్మాయిలు కాస్త ఇబ్బంది పడుతారు. కానీ హెబ్బా పటేల్ మాత్రం ఈజీగా నటించి మెప్పించింది. అందుకే ఆ సినిమాతో టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు దక్కించుకుంది. హెబ్బా పటేల్ కి తెలుగులో ఆ తర్వాత చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ అదృష్టం కలిసి రాలేదు. దాంతో ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరుస్తూ వచ్చాయి. అయినా సినిమా ఇండస్ట్రీని వదలకుండా ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. సినిమాలు సిరీస్‌లు అంటూ చాలానే ఈ అమ్మడికి ఆఫర్లు వచ్చాయి. వచ్చిన ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం



చేసుకునేందుకు అందాల ఆరబోత చేయడంతో పాటు చాలా రకాలుగా ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇప్పుడు మరోసారి ఈమె ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా చీర కట్టులో ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడి చీర కట్టు క్లోజప్ క్లిక్స్‌కి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఇంతటి అందగత్తెకు టాలీవుడ్ నుంచి సరైన ఆఫర్లు రాలేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉంటే, హెబ్బాకి కనీసం లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో మరిన్ని ఆఫర్లు వచ్చి ఉండాల్సింది అంటున్నారు. కొన్ని సినిమాల్లో నటనతో హెబ్బా వావ్ అనిపించింది. అందంతోనూ అబ్బా అనిపించింది. అలాంటి హెబ్బా పటేల్ కి కాలం కలిసి రాలేదు, సినిమాల్లో ఇకపై అయినా మరిన్ని ఆఫర్లు దక్కించుకుంటుందేమో చూడాలి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తెలుగులో ఈమె ఈడో రకం ఆడో రకం, ఎక్కడికి పోతావు చిన్నవాడా, అంధగాడు, 24 కిస్సెస్ తో పాటు ఇంకా పలు సినిమాల్లో నటించింది. ఇతర భాషల్లోనూ ఈమె నటించడం ద్వారా గుర్తింపు లభించింది. ప్రస్తుతం తెలుగులో పెద్దగా సినిమాలు చేయడం లేదు, కానీ కోలీవుడ్ లో మాత్రం ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు విడుదలకు సిద్దం అవుతున్నాయి. అక్కడ మూడు సినిమాల్లో ఒకటి రెండు హిట్ అయినా కచ్చితంగా మరిన్ని సినిమా ఆఫర్లు అక్కడ దక్కే అవకాశాలు ఉన్నాయి. పైగా తమిళ ప్రేక్షకులను మెప్పించే విధంగా ఇలాంటి అందమైన చీర కట్టు ఫోటోల్లో కనిపింస్తే మరిన్ని ఆఫర్లు రావడం ఖాయం.

# శ్రీవల్లి జోరు.. పార్ట్ 1 కి రూ.2 కోట్లు, పార్ట్ 2 కి రూ.10 కోట్లు?

పుష్ప సినిమాలో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న మరోసారి శ్రీవల్లిగా పుష్ప 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇటీవల ఒక చిట్ చాట్‌లో తన 8 ఏళ్ల సినీ కెరీర్‌లో అయిదు సంవత్సరాలు పుష్ప సినిమా కోసం వర్క్ చేసినట్లుగా చెప్పింది. మరో రెండేళ్లు పుష్ప 3 సినిమా కోసం ఈమె వర్క్ చేయాల్సి రావచ్చు. మొత్తానికి పుష్ప సినిమా కోసం శ్రీవల్లి పాత్రలో రష్మిక మందన్న చేస్తున్న హడావిడి సందడి అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాలో రష్మిక మందన్న ఓ రేంజ్‌లో సందడి చేస్తూ ఉంది. పాన్ ఇండియా స్థాయిలో పుష్ప కారణంగా గుర్తింపు దక్కించుకుంది అనడంలో సందేహం లేదు. పుష్ప మొదటి పార్ట్ కోసం రష్మిక మందన్న రూ.2 కోట్ల పారితోషికం తీసుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. ఇప్పుడు పుష్ప 2 సినిమా కోసం రష్మిక ఏకంగా రూ.10 కోట్ల పారితోషికం



అందుకుంది అనే వార్తలు వస్తున్నాయి. అల్లు అర్జున్ ఈ సినిమా కోసం రూ.150 కోట్ల పారితోషికం తీసుకోగా, దర్శకుడు సుకుమార్ సైతం రికార్డ్ స్థాయి పారితోషికం తన ఖాతాలో వేసుకున్నాడు. హీరోయిన్ రష్మిక మందన్న సైతం ఏకంగా రూ.10 కోట్ల పారితోషికం అందుకోవడం జరిగింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని ప్రస్థావిస్తే అంతా నిజం కాదని, పుకార్లు నమ్మవద్దు అంటూ నవ్వేసింది. ఆమె నో అన్నా పుష్ప 2 కోసం రష్మిక తీసుకున్న పారితోషికం తక్కువ కాదని ప్రతి ఒక్కరు అంటున్నారు. దాదాపు రెండేళ్ల పాటు పుష్ప 2 సినిమా కోసం డేట్లు కేటాయించింది. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో సినిమా చేయాలని భావించి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత పుష్ప 2 సినిమా కోసం ఎక్కువ డేట్లు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఆ సినిమాను క్యాన్సల్ చేసుకుంది. నితిన్ సినిమా మాత్రమే కాకుండా మరికొన్ని సినిమాలను సైతం రష్మిక మందన్న పుష్ప 2 సినిమా కోసం క్యాన్సల్ చేసుకుంది. అందుకు పుష్ప 2 సినిమా కోసం ఆమెకు రూ.10 కోట్ల పారితోషికం ఎక్కువ ఏం కాదని అంతా భావిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ వారు రష్మిక మందన్నకు ఇచ్చిన పారితోషికం సౌత్‌లోనే అత్యధికం అనే టాక్ వినిపిస్తూ ఉంది. లేడీ సూపర్ స్టార్ నయనతార నాలుగు నుంచి ఆరు కోట్ల రూపాయల పారితోషికంను అందుకుంటూ ఉంటుంది. ఇతర హీరోయిన్స్ సైతం అటు ఇటుగా మూడు నుంచి అయిదు కోట్ల పారితోషికం అందుకుంటారు. కానీ రష్మిక మందన్న ఏకంగా బాలీవుడ్ ముద్దుగుమ్మల స్థాయిలో ఏకంగా రూ.10 కోట్ల పారితోషికం అందుకోవడం ద్వారా తన స్టార్‌డమ్‌ను నిలుపుకుంది.



# సీఎంగా ఫడణవీస్.. శిందే, పవార్‌కు డిప్యూటీ..!

ముంబయి: మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై మహాయుతి కూటమి మధ్య చర్చలు కొలిక్కివచ్చినట్లే కన్పిస్తోంది. తదుపరి ముఖ్యమంత్రిగా భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ రాష్ట్ర పగ్గాలు అందుకోవడం ఖాయమైనట్లు సమాచారం. ఇక ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ఉప ముఖ్యమంత్రి పదవిని తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. డిసెంబరు 5న మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం జరగనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఈసారి కూడా ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉంటారని, శిందేతో పాటు ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా ఆ రోజున ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారని తెలిపాయి. బుధవారం భాజపా శాసనసభాపక్ష నేతల సమావేశం జరగనుంది. ఇందులో కొత్త సీఎంను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. సీఎం పదవి, శాఖల కేటాయింపుపై మహాయుతి కూటమి మధ్య గత కొంతకాలంగా ప్రతిష్టంభన నెలకొన్న సంగతి తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి పదవి తనకు వద్దని, హోంశాఖను కేటాయించాలని శిందే పట్టుబట్టినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే మహారాష్ట్ర పరిస్థితులను పర్యవేక్షించడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీలను పరిశీలకులుగా భాజపా అధిష్ఠానం నియమించింది. మరోవైపు, ఎన్డీయే నేత రామ్‌దాస్ అథవాలే తాజాగా ఏక్‌నాథ్ శిందేతో చర్చలు జరిపినట్లు సమాచారం. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించాలని ఆయనకు నచ్చజెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు శిందే కూడా సుముఖత వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది.

**మెరుగుపడని శిందే ఆరోగ్యం..** మరోవైపు ఏక్‌నాథ్ శిందే కొన్ని రోజులుగా జ్వరం, గొంతునొప్పితో ఇబ్బందిపడుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మంగళవారం ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు శిందే సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. థానెలోని ఓ ఆసుపత్రిలో ఆయన చెకప్ చేయించుకున్నారు. ఆయనకు పలు వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచించినట్లు సదరు వర్గాలు తెలిపాయి.



# హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో సుందరీకరణ పనులు.. సీఎం శంకుస్థాపన

హైదరాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో రైజింగ్ వేడుకలు నిర్వహించారు.

ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్‌ఎండీఏ మైదానంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రాజెక్టులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రేటర్ పరిధిలో రూ.150 కోట్లతో పలు సుందరీకరణ పనులు, రూ.3,500 కోట్లతో రహదారి అభివృద్ధి పనులనకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.16.50 కోట్లతో నిర్మించిన భూగర్భ సంపులను ప్రారంభించారు.

దేశంలోనే అతిపెద్ద ఎస్టీపీని సీఎం ప్రారంభించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టబోయే 6 జంక్షన్ల అభివృద్ధి, 7 ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కిట్లను అందించారు.

# తెలంగాణలో భవన, లేఅవుట్ల అనుమతులకు కొత్త ఆన్‌లైన్ విధానం




హైదరాబాద్: భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్‌లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 'బిల్డ్ నౌ' పేరుతో ఏర్పాటు చేసిన ఈ విధానాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. "పట్టణాభివృద్ధిలో గతంలో లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉంటున్నందున ఈ శాఖ ప్రాధాన్యతపై దృష్టి పెట్టి.. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నాం. స్థిరాస్తి రంగంలో ఇప్పటికీ హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. హైదరాబాద్ ప్రజలే గృహ రుణాలు అధికంగా తీసుకుంటున్నారు" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# హైడ్రాకు రూ.50 కోట్లు విడుదల.. పురపాలక శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు నిధులు విడుదల చేసింది. నగరంలో ప్రభుత్వ స్థలాలు, పార్కుల పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ, విపత్తు నిర్వహణ కోసం పనిచేస్తోన్న హైడ్రాకు రూ.50కోట్లు విడుదల చేస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైడ్రా కార్యాలయం నిర్వహణ, కొత్త వాహనాల కొనుగోలుతోపాటు ఇప్పటి వరకు కూల్చివేతలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు కోసం ఈ నిధులు ఖర్చు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బడ్జెట్‌లో హైడ్రాకురూ.200 కోట్లు కేటాయించిన ప్రభుత్వం తాజాగా రూ.50 కోట్లు విడుదల చేయడంతో హైడ్రాకు ఆర్థికంగా మరింత బలం చేకూరింది.

# తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన శ్రీకాంతాచారి ప్రాణత్యాగం: కేటీఆర్



హైదరాబాద్: శ్రీకాంతాచారి అమరత్వం గొప్పదని, ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ అరెస్టును చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యారని చెప్పారు. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిందన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా జోహార్లు అర్పించారు. 'శ్రీకాంతాచారి అమరత్వం గొప్పది. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ గారి అరెస్ట్ ను చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యాడు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయనకు జోహార్లు అర్పిస్తున్నాను. జోహార్ శ్రీకాంతాచారి! జై తెలంగాణ.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# శబరిమల వెళ్లే భక్తులకు రైల్వే శాఖ కీలక సూచనలు

సికింద్రాబాద్: శబరిమల వెళ్లే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే కీలక సూచన చేసింది. రైళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని, కర్పూరం వెలిగించవద్దని విజ్ఞప్తి చేసింది. యాత్రికుల రైళ్ల కోచ్‌ల లోపల పూజా విధానంలో భాగంగా కర్పూరం వెలిగించడం, హారతి ఇవ్వడం, అగరబత్తులు, సాంబ్రాణి పుల్లలు వెలిగించడం వంటివి చేస్తున్నట్టు రైల్వే అధికారుల దృష్టికి వచ్చిందని తెలిపింది. ఇలాంటి కార్యక్రమాలు రైళ్లలో చేయవద్దని ప్రయాణికులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. యాత్రికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్లు జోన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడ, తిరుపతి, నాందేడ్ తదితర స్టేషన్ల నుంచి బయలుదేరి మార్గమధ్యలో పలు స్టేషన్లలో ఆగుతాయి. ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణించే వారు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సహకారం కోరుతుంది. రైళ్లలో, రైలు ప్రాంగణాలలో ఎలాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని విజ్ఞప్తి చేస్తుంది. మండే స్వభావంగల పదార్థాలతో ప్రయాణం చేయడం, వాటిని ఏ రూపంలోనైనా వెలిగించడం నిషేధించినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. మండే స్వభావంగల పదార్థాలతో అగ్ని ప్రమాదాలకు దారితీసి మానవ ప్రాణాలకు ముప్పు కలిగించడమే కాకుండా... రైల్వే ఆస్తులకు సైతం నష్టం కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇలాంటి చర్యలు రైల్వే చట్టం-1989లోని సెక్షన్లు 67, 154, 164, 165 ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడతాయని స్పష్టం చేస్తోంది. ఇటువంటి చర్యల వల్ల జరిగిన నష్టానికి బాధ్యత వహించడంతోపాటు, 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశముందని అధికారులు తెలిపారు.






# ములుగు ఎన్‌కౌంటర్ కేసు.. హైకోర్టు ఏం చెప్పిందంటే

హైదరాబాద్, డిసెంబర్ 3: ములుగు ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ములుగు ఎన్‌కౌంటర్ తదుపరి చర్యలు, పోస్టుమార్టం రిపోర్టును అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌పై ఈరోజు (మంగళవారం) విచారణ జరిపిన న్యాయస్థానం మల్లయ్య మృతదేహాన్ని గురువారం వరకు భద్రపరచాలని ఆదేశించింది. మిగిలిన మృతదేహాలను కుటుంబసభ్యులకు అందించాలని చెప్పింది. తదుపరి విచారణను గురువారం (డిసెంబర్ 5)కు వాయిదా వేసింది. నిన్నటి విచారణలో ఈరోజు వరకు మృతదేహాలను భద్రపరచాలని హైకోర్టు ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. నేడు మరోసారి పిటిషనర్ తరపున, అలాగే ప్రభుత్వం తరపున వాదనలు కొనసాగాయి. అయితే మృతదేహాలపైన అనేక గాయాలు ఉన్నాయని, ఇదొక బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. భద్రపరిచిన మృతదేహాలకు రీ పోస్టుమార్టం నిర్వహించాలని పదే పదే కోరారు. మరోవైపు నిన్న హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన సమయంలో పోస్టుమార్టం అంతా కూడా చీకటిలో నిర్వహించారని, పంచనామా ప్రక్రియ సరిగ్గా నిర్వహించలేదు కాబట్టి రీపోస్టుమార్టం చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. అలాగే ప్రభుత్వం తరపున న్యాయవాది కూడా తన వాదనలు వినిపిస్తూ.. ఎన్‌హెచ్‌ఆర్సీ గైడ్‌లెన్స్ ప్రకారం, అలాగే హైకోర్టు ఆదేశాల మేరకే శవ పరీక్షలు పూర్తి చేశామని స్పష్టం చేశారు. కేవలం ఎదురుకాల్పుల్లో మాత్రమే మావోలు మృతిచెందారని ప్రభుత్వ తరపు న్యాయవాది తన వాదనలు వినిపించారు. ఎక్కడా కూడా ఇది బూటకపు ఎన్‌కౌంటర్ కాదని, ఆహారంలో ఎలాంటి విషం ఇవ్వలేదని న్యాయవాది స్పష్టం చేశారు. ఎనిమిది మంది వైద్య నిపుణులతో పోస్టుమార్టం పూర్తి చేశామని వాటికి సంబంధించి ఫోటోగ్రఫీ కూడా కోర్టుకు అందజేస్తున్నామని ప్రభుత్వం తరుపున న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. మృతదేహాలను భద్రపరిచనట్లైతే శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని.. అందుకే మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించేందుకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోరారు. అయితే మావోలకు భోజనంలో విషం కలిపారని, ఆపై కస్టడీలోకి తీసుకుని కాల్చిచంపారన్న అంశాన్ని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లగా.. పీఎంఈ రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో వాదనలు వినిపించాలని హైకోర్టు చెప్పింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. కేవలం మల్లయ్య మృతదేహం తప్ప మిగిలిన మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పీఎంఈ రిపోర్టుతో పాటు ఎన్‌కౌంటర్ జరిగిన పరిణామాలకు సంబంధించిన రిపోర్టు, ఎన్‌కౌంటర్ తదుపరి చర్యలను న్యాయస్థానానికి అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. గురువారం రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆ నివేదికను ఇచ్చిన తరువాత తదుపరి చర్యలకు హైకోర్టు ఆదేశించే అవకాశం ఉంది. కేవలం పిటిషనర్‌గా మల్లయ్య భార్య ఉన్నందున.. ఆయన మృతదేహాన్ని తప్ప మిగిలిన మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# రేవంత్.. నువ్వెన్ని బ్లాక్‌మెయిల్స్ చేసినా భయపడను.. హరీష్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఇవాళ(మంగళవారం) కేసు నమోదైంది. సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని పంజాగుట్ట పోలీసులకు చక్రధర్ ఫిర్యాదు చేశారు. దీంతో హరీష్ రావుతో పాటు టాస్క్ ఫోర్స్‌లో పనిచేసిన రాధాకిషన్ రావుపై కేసు నమోదు చేశారు.

అయితే ఈ కేసుతో పాటు మరికొన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా భయపడనని సీఎం రేవంత్‌రెడ్డికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

**దేవుళ్లను సైతం దగా చేశావ్..** "నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడం. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించావు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించావు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో నా మీద సంబంధం లేని కేసు పెట్టించావు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసు ఒకటి మానకొండూరులో అక్రమ కేసు పెట్టించావు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించావు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపను. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగను" అని హరీష్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

**నీ అన్యాయాలను నిలదీస్తా..** "నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపను. మిస్టర్ రేవంత్ రెడ్డి.. అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీమీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావు" అని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రేవంత్‌రెడ్డి ఏడాది పాలనే మోసం, దగా..** మోసం, దగా, వంచనకు రేవంత్‌రెడ్డి ఏడాది పాలనే నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అధికారం కోసం ప్రజలను మోసగించడం ఆయన నైజమని ఆరోపించారు.

ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులతోనే కాంగ్రెస్ ఏడాది పాలన సాగిందని ధ్వజమెత్తారు. గతంలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి.. సీఎం అయ్యాక, ఉన్న రైతుబంధునే ఇవ్వడం లేదని హరీశ్‌రావు విమర్శించారు.

**చార్జిషీట్ పెడతా..** కౌలు రైతులకూ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఓవైపు చెబుతుండగా.. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం రైతు భరోసా డబ్బులపై రైతు, కౌలు రైతు మాట్లాడుకోవాలని చెబుతున్నారని, ఇదెక్కడి విడ్డూరమని అన్నారు. రేవంత్ అరాచక, బుకాయింపు పాలనపై తెలంగాణ ప్రజల ముందు చార్జిషీట్ పెడతానని హరీశ్ చెప్పారు. కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యం, మోసాలను ఈ నెల 7న ప్రజలకు పూర్తిస్థాయిలో వివరిస్తానని తెలిపారు. శిలా ఫలకాలపై సీఎం పేరు ఉండొద్దన్న రేవంత్.. ఇప్పుడు ఏకంగా ఫొటోనే వేయించుకుంటున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆసక్తికర కామెంట్స్



హైదరాబాద్, డిసెంబర్ 3: కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. "పెద్దసార్‌తో(కేసీఆర్) ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలకు దూరంగా ఉంటోన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌తో టచ్‌లో ఉన్నారు. కేసీఆర్ ఓకే చెప్తే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గులాబీ కండువా కప్పుకుంటారు" అంటూ కామెంట్స్ చేశారు. కొత్త పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తన ఉనికి కోసం ఏదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు చెప్పినట్లు తాము కాంగ్రెస్‌తో టచ్‌లో లేమని తెలిపారు. ప్రజల పక్షాన పోరాడుతున్నందునే హరీష్ రావుపై కేసు పెట్టారని మండిపడ్డారు. ఢిల్లీలో తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వం అని విమర్శించారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలకు మూటలు మోయడానికి రేవంత్ పనిచేస్తున్నారని.. పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని కూడా రేవంత్ విస్తరించలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రేవంత్ నమ్మించి గొంతు కోశారన్నారు. కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు శాశ్వత ప్రభుత్వాలు కాదన్నారు. లిమిట్ దాటి పనిచేసే అధికారులను వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలను ఇంటిలిజెన్స్ అధికారులను బెదిరిస్తున్నారు అంటూ ఎమ్మెల్యే వివేక్ వెల్లడించారు. ఏం సాధించారని సంబురాలు జరుపుకుంటున్నారో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ నవంబర్ రాష్ట్రంగా నిలిచిందన్నారు. మత్స్యకారులు, నాయిని బ్రాహ్మణలు రోడ్ల మీదకు వస్తే.. ప్రత్వం సంబురాలు జరుపుతోందని మండిపడ్డారు. మత్స్యకారులు, నాయి బ్రాహ్మణులవి న్యాయమైన డిమాండ్లు అని తెలిపారు. కేసీఆర్ పథకాలనే ప్రజలు నేటికి గుర్తుచేసుకుంటున్నారన్నారు. నాయి బ్రాహ్మణల ఆందోళనలను బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మత్స్య వృత్తిపైన ఆధారపడి జీవిస్తోన్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేతివృత్తుల వారికి అండగా నిలిచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. కోతల ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యలు చేశారు.

# తాజ్‌మహల్‌ను పేల్చివేస్తామంటూ బెదిరింపు మెయిల్



ఆగ్రా: ప్రపంచ ప్రఖ్యాత కట్టడం తాజ్‌మహల్‌ను పేల్చివేస్తామంటూ వచ్చిన బెదిరింపు మెయిల్ అధికారులను పరుగులు పెట్టించింది. చివరికి బూటకమని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ టూరిజం ప్రాంతీయ కార్యాలయానికి మంగళవారం గుర్తు తెలియని ఖాతా నుంచి ఓ మెయిల్ వచ్చింది. తాజ్‌మహల్‌ను పేల్చివేస్తామన్నది ఆ మెయిల్ సారాంశం. దీంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్‌స్కాడ్, ఇతర బృందాలు తాజ్‌మహల్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. అయితే, అనుమానాస్పద వస్తువులేవీ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాజ్‌మహల్ చుట్టూ భద్రతను మరింత పెంచినట్లు ఏసీపీ సయీద్ అరీబ్ అహ్మద్ మీడియాకు వెల్లడించారు. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందన్న దానిపై దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెయిల్ వచ్చిన వెంటనే ఆగ్రా పోలీసులకు, ఇతర ఉన్నతాధికారులకు సమాచారమందించామని ఉత్తర్‌ప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి వాత్స తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com